

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com








హైదరాబాద్ | బుధవారం 22-7-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 307 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# కరీంనగర్‌లో ఇక నిరంతర తాగునీరు



కరీంనగర్ పట్టణంలో మంచినీటి పథకాన్ని ప్రారంభించిన మంత్రి కెటిఆర్. చిత్రంలో మంత్రి గంగుల కమలాకర్ కూడా ఉన్నారు.

### అందుబాటులోకి ఐటి టవర్ సెంటర్
### లాంఛనంగా ప్రారంభించిన మంత్రి కెటిఆర్
### ఇక్కడ సెంటిమెంట్ బాగా పనిచేస్తుందని వ్యాఖ్య
### చేపట్టిన ప్రతిపనీ విజయవంతమే అని వెల్లడి

కరీంనగర్,జూలై21(నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ సెంటిమెంట్ ఎప్పుడూ బలంగా పనిచేస్తోందని, ఇక్కడ చేపట్టిన ఏ పనయినా విజయవంతం అవుతోందని మంత్రి కెటిఆర్ అన్నారు. కరీంనగర్ పట్టణానికి నిరంతర తాగునీటిని అందించే మిషన్ భగీరథ పథకానికి, ఐటి సెంటర్‌కు కెటిఆర్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా అవసరాల మేరకు 30ఏళ్ల ప్రణాళికతో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టామని మంత్రి కేటీఆర్ తెలిపారు. శాతవాహన వర్సిటీలో మెయిన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను మంగళవారం మంత్రి ప్రారంభించారు. కాళేశ్వరం నీటితో ఎల్ఎండి,అప్పర్ మానేరులో నీరు సమృద్ధిగా అందుబాటులో ఉంటుందన్నారు. తాగు,సాగునీరుకు ఇక్కట్లు లేకుండా చేశామన్నారు. తెలంణా కోటి ఎకరాల మాగాణం లక్ష్యంగా సిఎం కెసిఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. తెలంగాణలో గ్రామీణ ప్రజల జీవితాలను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కరీంనగర్‌లో ఏ పని ప్రారంభించినా తప్పకుండా విజయవంతమవుతుందన్నారు. తాగు, సాగునీరు, విద్యుత్ ఇబ్బందులను తక్కువకాలంలో అధిగమించామన్నారు. కేవలం మూడేళ్ల వ్యవధిలోనే కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేసుకున్నాం. ఒక్కో పని దిగ్విజయంగా పూర్తి చేసుకుంటూ ముందుకెళ్తున్నాం. కరీంనగర్ పట్టణ ప్రజలకు ఇక నుంచి ప్రతి రోజు మంచి నీరు అందనుందని కేటీఆర్ అన్నారు. కరీంనగర్ పట్టణంలో ప్రతి రోజు మంచి నీరు అందించే కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని కేటీఆర్ తెలిపారు. కరీంనగర్‌లో ఏ కార్యక్రమం చేపట్టిన విజయవంతం అవుతుంది. ఏ పని ప్రారంభించినా కరీంనగర్‌లో నాంది పలకడం సంప్రదాయంగా మారిందన్నారు. ఇక్కడి నుంచే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అభివృద్ధి పనుల విస్తరణ జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ క్రమంలో 247 వాటర్ సైప్లె కూడా కరీంనగర్ నుంచే ప్రారంభం కావాలన్నారు. 30 ఏళ్ల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టినట్లు కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రమంత ఈ పథకం ఆదర్శం కావాలని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో దీర్ఘకాలిక ప్రణాళికలతో కీలక రంగాలపై దృష్టి పెట్టామని తెలిపారు. ఒక్కో పని దిగ్విజయంగా పూర్తి చేసుకుంటూ ముందుకెళ్తున్నామని ఆయన చెప్పారు. అందరికీ 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం. భవిష్యత్ తరాలు బాగుండాలని 230 కోట్ల మొక్కలు నాటాలనేది లక్ష్యం. త్వరలో తీగల వంతెనను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తాం. కరీంనగర్‌కు కొత్త శోభను తీసుకువచ్చేలా జంక్షన్ రూపొందిం చాలన్నారు. టీహబ్ ప్రాంతీయ కేంద్రం కరీంనగర్‌లో ఏర్పాటు కాబోతోంది. పరిశ్రమల ఏర్పాటుకు ఇతర దేశాల్లో స్థిరపడిన వారికి ఇది మంచి అవకాశం. దేశానికి ధాన్య భాండాగారంగా తెలంగాణ మారిందని కేటీఆర్ వివరించారు. బీడు భూములకు గోదావరి, కృష్ణా జలాలను పారిస్తున్నామని పేర్కొన్నారు. అందరికీ 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని గుర్తు చేశారు. ఇరిగేషన్ శాఖను జలవనరు శాఖగా మార్చామని మంత్రి తెలిపారు. సాగు, తాగు నీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని స్పష్టం చేశారు. తెల్లరేషన్ కార్డు ఉన్నవారికి రూ. 1కే నల్లా కనెక్షన్ ఇస్తామన్నారు. కరీంనగర్ జనసాంద్రత ప్రకారం.. అర్బన్ లంగ్స్ ఏర్పాటు చేస్తామని

మంత్రి తెలిపారు. రాబోయే నెల రోజుల్లో కేబుల్ బ్రిడ్జి పూర్తి చేసి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. కరీంనగర్‌కు కొత్త అందాన్ని తెచ్చే అలుగునూరు చౌరస్తాను సుందరమైన జంక్షన్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. హైదరాబాద్‌కు పరిమితమైన ఐటీ ఇప్పుడు కరీంనగర్ జిల్లాకు విస్తరించింది. కరీంనగర్‌లో నైపుణ్య శిక్షణా కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. టీ హబ్ ప్రాంతీయ కేంద్రం కరీంనగర్ జిల్లాలో ఏర్పాటు కాబోతోందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ఇతర దేశాల్లో స్థిరపడ్డ కరీంనగర్ వాసులు సహకరించాలని మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్ మానేరు తీరంలో మొక్కలు నాటారు.

### ఇక్కడ పుట్టడం అదృష్టం అన్న గంగుల

కేసీఆర్ పుట్టిన గడ్డ మీద తామందరం పుట్టడం అదృష్టమని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. మంగళవారం ప్రతిరోజూ నీటి సరఫరాను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి గంగుల మాట్లాడుతూ కేసీఆర్ కడుపున కేటీఆర్ పుట్టడం ఒక వరమని... కేటీఆర్ బర్త్ డే కానుకగా కరీంనగర్‌కు తాగునీరు వచ్చిందని తెలిపారు. గత పాలకులు కరీంనగర్‌ను పట్టించుకోలేదని విమర్శించారు. కరీంనగర్ చిరకాల వాంఛ ప్రతిరోజూ తాగునీరని..ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు.

# ఉస్మానియాను కూల్చి కొత్తది కట్టండి

### ప్రభుత్వానికి వైద్యుల విజ్ఞప్తి

హైదరాబాద్,జూలై21(ఆర్ఎన్ఎ): శిథిలావస్థలో ఉన్న ఉస్మానియా ఆస్పత్రి భవనాన్ని కూల్చి.. కొత్త ఆస్పత్రిని నిర్మించాలని ఉస్మానియా వైద్యులు ప్రభుత్వాన్ని కోరారు. ఉస్మానియా జనరల్ ఆస్పత్రిని కాపాడండి అని డాక్టర్లు బ్యానర్లు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. కూలిపోతున్న బిల్డింగ్‌ను కూల్చవద్దు అంటూ కొందరు అడ్డుపడడం వారి అవివేకానికి నిదర్శనమని డాక్టర్లు ధ్వజమెత్తారు. పాత భవనాన్ని కూల్చి కొత్త భవనాన్ని కట్టాలని, ఈ విషయంలో ప్రభుత్వానికి అండగా ఉంటామని వైద్యులు తేల్చిచెప్పారు.

గతంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ భవనాన్ని పరిశీలించి.. కొత్త బిల్డింగ్ నిర్మించడానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని డాక్టర్లు గుర్తు చేశారు. కానీ కొంతమంది అడ్డుకుని, కోర్టుకు వెళ్లి స్టే తీసుకురావడం సరైనది కాదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉస్మానియా నూతన భవన నిర్మాణానికి అడ్డు పడితే సహించేది లేదని డాక్టర్లు స్పష్టం చేశారు. ప్రాణాలు నిలబెట్టడానికి ఈ ఆస్పత్రిని కట్టారు. కానీ ఇప్పుడు అది కూలి రోగులతో పాటు వైద్యుల ప్రాణాలు తీసేలా ఉందన్నారు. కచ్చితంగా ఉస్మానియా ఆస్పత్రిని నూతనంగా నిర్మించి తీరాలని వైద్యులు విజ్ఞప్తి చేశారు.

# ఆరోగ్యశాఖ కార్యదర్శి కుటుంబంలో నలుగురికి కరోనా

చెన్నై,జూలై21(ఆర్ఎన్ఎ): తమిళనాడు ఆరోగ్యశాఖ కార్యదర్శి జే రాధాకృష్ణన్ కుటుంబంలోని నలుగురికి కరోనా సోకింది. తాజాగా రాధాకృష్ణన్ భార్య, కుమారుడికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. కొవిడ్-19 టెస్టులో రాధాకృష్ణన్‌కు కొవిడ్-19 నెగెటివ్‌గా తేలింది. ఇంతకు ముందే రాధాకృష్ణన్ మామ, అత్త కరోనా బారినపడ్డారు. ప్రస్తుతం నలుగురు కరోనా బాధితులు చెన్నైలోని గిండిలో గల కింగ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ అండ్ రిసెర్చ్‌లో చికిత్స పొందుతున్నారు. తమిళనాడులో సోమవారం కొత్తగా 4,985 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య బినీ 1,75,678కు పెరిగింది. ఒక్క చెన్నైలోనే 1,298 మందికి వైరస్ సోకింది.

# రాజీవ్ హత్యకేసు నిందితురాలు నళిని ఆత్మహత్యాయత్నం

### అడ్డుకున్న వేలూరు జైలు సిబ్బంది

చెన్నై,జూలై21(ఆర్ఎన్ఎ): మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ హత్య కేసులో నిందితురాలైన నళిని శ్రీహరన్ ఆత్మహత్యాయత్నం చేసింది. తమిళనాడులోని వేలురు జైలులో మంగళవారం ఉదయం ఆమె ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. గమనించిన జైలు సిబ్బంది ఆమెను ఆస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని నళిని లాయర్ పుహళేంది తెలిపారు. బెయిల్ కోసం ప్రయత్నిస్తున్న నళిని ఇటీవల పెరోల్‌పై కుమార్తె హరిత వివాహం కోసం ఆరు నెలలపాటు బయటకు వెళ్లి వచ్చింది. రాజీవ్ హత్య కేసులో దోషిగా తేలిన నళిని 29 ఏళ్లుగా జైలు జీవితం గడుపుతోంది. బెయిల్ కోసం గతకొంత కాలంగా ప్రయత్నాలు చేస్తుంది. రాజీవ్ హత్యకేసులో నళినితో పాటు ఆమె భర్త మురుగన్ సహా ఏడుగురు వేలూరు సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. తోటి ఖైదీకి, నళికి మధ్య జైలులో గొడవ జరిగిందని, దీంతో ఆ మహిళ విషయాన్ని జైలర్ దృష్టికి తీసుకెళ్లిందని పుహళేంది తెలిపారు. ఆ వెంటనే నళిని ఆత్మహత్యకు యత్నించినట్టు పేర్కొన్నారు. అయితే, గతంలో ఎప్పుడూ నళిని ఇలా చేయలేదని, ఇందుకు గల కారణాలు తెలుసుకుంటామన్నారు. విషయం తెలిసిన నళిని భర్త తనను పిలిచి ఆమెను పుళల్ జైలుకు తరలించేలా చూడాలని కోరారు. ఈ విషయమై త్వరలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పుహళేంది తెలిపారు.

# తీరప్రాంత ఇళ్లలోకి చేరిన సముద్రపు నీరు





కొచ్చి : కేరళ రాష్ట్రంలోని కొచ్చి నగర సమీపంలోని సముద్ర తీరప్రాంతమైన చెల్లనం గ్రామంలోకి సముద్రపు నీరు వచ్చి చేరింది. అసలే కరోనా వైరస్ వ్యాప్తితో సతమతమవుతున్న ఆ గ్రామ ప్రజలు తమ ఇండ్లలోకి సముద్రం నీరు అలల ద్వారా రావడంతో ఆందోళన చెందుతున్నారు. గతంలో సముద్రపు నీరు ఇళ్లలోకి చేరినప్పుడు గ్రామ ప్రజలు సమీపంలోని వారి బంధువుల ఇంటికి వెళ్లేవారు. కానీ ఇప్పుడు కరోనా వల్ల ఆ అవకాశం కూడా లేకుండాపోయింది. నీరు చేరినా అవే ఇళ్లల్లో ఉండిపోయారు. చెల్లనం గ్రామంలో 200 కరోనా కేసులు నమోదైనాయి. వీటికితోడు ఇళ్లలోకి సముద్రపు నీరు రావడంతో 12 ఇళ్లు దెబ్బతిన్నాయి. దీంతో ఆ గ్రామ ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ పరిస్థితి గురించి చెల్లనం గ్రామ పంచాయతీ అధ్యక్షుడు మెర్సీ జోసీ మాట్లాడుతూ 'చాలా చోట్ల ఇళ్లు పడిపోతున్నాయి, నాకు ఖచ్చితమైన లెక్క లేదు. చాలా మంది వారి ఇళ్లపై ఎక్కి కూర్చుంటున్నారు' అని చెప్పారు. ఆ గ్రామానికి చెందిన ఉబెర్ డ్రైవర్ ఆంటోనీ జాక్సన్ అక్కడి తీవ్రత గురించి తెలియ జేశాడు. సముద్ర తీరం నుంచి 600 మీటర్ల దూరంలో ఉన్న ప్రధాన రహదారికి సోమవారం మధ్యాహ్నం నాటికి నీరు చేరుకుందని తెలిపాడు. సముద్రపు నీరు ఇళ్లలోకి రాకుండా తీరం వెంబడి అడ్డుగా గోడ నిర్మించాలని స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ పరిస్థితికి సంబంధించిన ఓ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

# ఇక ఇంటింటికీ రేషన్ పంపిణీ

### ఢిల్లీ సర్కార్ తాజా నిర్ణయం

న్యూఢిల్లీ,జూలై21(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్ సారథ్యంలో ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం.. జగన్ సర్కార్ ఫార్ములాను అనుసరిస్తున్నట్టుగా కనిపిస్తోంది. ఏపీలో చౌకధరల దుకాణాల ద్వారా అందజేసే బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను తెల్లరేషన్ కార్డుదారుల ఇళ్ల వద్దకే పంపిణీ చేయడానికి ఏపీ ప్రభుత్వం సంకల్పించినట్టే.. ఢిల్లీ సర్కార్ కూడా అలాంటి పథకాన్ని ప్రకటించింది. అర్హులకు రేషన్ సరుకులను ఇంటి వద్దకే పంపిణీ చేయడానికి ప్రత్యేక పథకాన్ని ప్రారంభించబోతోంది.

దీనికి సంబంధించిన ప్రతిపాదనలపై ఢిల్లీ మంత్రివర్గం మంగళవారం ఆమోదించింది. ఈ పథకానికి ముఖ్యమంత్రి ఘర్ ఘర్ రేషన్ యోజన అని పేరు పెట్టింది. ఈ పథకం వెంటనే అమల్లోకి వచ్చేలా చర్యలను తీసుకుంటున్నామని అరవింద్ కేజీవ్రాల్ వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ఆమోదించినట్లు తెలిపారు. మంత్రివర్గం ఏకగ్రీవంగా ఈ పథకాన్ని ఆమోదించిందని, మంత్రులు హర్షం వ్యక్తం చేశారని అన్నారు. నిత్యావసర సరుకుల కోసం లబ్దిదారులు రేషన్ షాపుల కోసం రావాల్సిన అవసరం లేదని అన్నారు. బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను లబ్దిదారుల గడప వద్దకు పంపిణీ చేస్తామని చెప్పారు. దీనికోసం ప్రత్యేక యంత్రాంగాన్ని నియమించబోతున్నామని కేజీవ్రాల్ స్పష్టం చేశారు. ఇంటింటికీ నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలనేది ఢిల్లీవాసుల చిరకాల కల అని, దాన్ని తాము నెరవేర్చబోతున్నామని అన్నారు. దేశ రాజధానిలో ప్రస్తుతం 2016 రేషన్ షాపులు ఉన్నాయని, వాటి ద్వారా సరుకులను లబ్దిదారుల ఇంటి వద్దకే చేర్చుతామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వన్ నేషన్ వన్ రేషన్ కార్డు పథకం అమల్లోకి వచ్చే రోజే తాము ఢిల్లీలో ఘర్ ఘర్ రేషన్ యోజనను ప్రారంభిస్తామని అన్నారు. దేశ రాజధాని పరిధిలో గల బస్తీల్లో వేలసంఖ్యలో పూరి గుడిసెలు ఉన్నాయని, ఇంటి వద్దకే సరుకులను పంపిణీ చేయడం వల్ల వారందరికీ మేలు కలిగించినట్టవుతుందని కేజీవ్రాల్ వ్యాఖ్యానించారు. తెల్లరేషన్ కార్డుదారులకు నిత్యావసర సరుకులను ఇంటింటికీ పంపిణీ చేయడానికి ఇదివరకే జగన్ ప్రభుత్వం చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి దీన్ని అమల్లోకి తీసుకుని రానుంది. 5, 10, 15, 20 కేజీల సామర్థ్యంతో కూడిన సంచులను రూపొందించింది. బియ్యం పంపిణీలో అవినీతి, అవకతవకలను నివారించడానికి జగన్ ప్రభుత్వం ఈ పథకాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. శ్రీకాకుళం జిల్లాలో ట్రయల్ రన్ నడుస్తోంది.

# ఈశాన్య రాజధానులకు కలుపుతూ రైల్వేనెట్‌వర్క్

### వెల్లడించిన రైల్వేబోర్డ్ ఛైర్మన్ వినోద్ యాదవ్

న్యూఢిల్లీ,జూలై21(ఆర్ఎన్ఎ): ఈశాన్య రాష్ట్రాల రాజధానులను కలుపుతూ 2023 నాటికి రైల్వే నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే బోర్డు తెలిపింది. 2023 నాటికి ఈశాన్య రాష్ట్రాలఅన్ని రాజధానులను రైల్ నెట్‌వర్క్‌కు అనుసంధానించే పనిలో భారతీయ రైల్వే కృషి చేస్తోందని రైల్వే బోర్డు చైర్మన్ వినోద్ కుమార్ యాదవ్ వర్చువల్ మీడియా సమావేశంలో తెలిపారు. ఈశాన్యంను అనుసంధానించే ప్రాజెక్టును అప్పటికే అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్క సిక్కిం మినహా అన్ని ఈశాన్య రాష్ట్రాలు రైలు నెట్‌వర్క్‌తో అనుసంధానించబడి ఉన్నాయన్నారు. ప్రస్తుతం తాము ఈశాన్య రాజధానులను అనుసంధానించే పనిలో ఉన్నట్లు చెప్పారు. అసోం, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్ రాజధానులు ఇప్పటికే అనుసంధానించబడి ఉన్నాయన్నారు. మణిపూర్, మిజోరాం, నాగాలాండ్, మేఘాలయ రాజధానులను కలిపే పనిలో ఉన్నట్లు వెల్లడించారు. మార్చి 2022 లో మణిపూర్, మార్చి 2023 లో మిజోరం, మార్చి 2023 లో నాగాలాండ్, మార్చి 2022 లో మేఘాలయ, 2022 డిసెంబర్‌లో సిక్కిం అనుసంధానించబడతాయి అని యాదవ్ చెప్పారు.

## చరిత్రలో నేటినిజం





–రాధశ్రీ

(జులై 22 దాశరథి కృష్ణమాచార్యుల జయంతి..)

సెల్: 9494481210

# బోనాలకు సహకరించిన వారికి కృతజ్ఞతలు: మంత్రి

హైదరాబాద్,జూలై21(ఆర్ఎన్ఎ): బోనాల ఉత్సవాలు నిరాడంబరంగా జరిగేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తల్లుల ఆశీర్వాదంతో ఈ బోనాలు ప్రశాంతంగా విజయవంతమయ్యాయని, సహకరించిన భక్తులు, అధికారులు, సిబ్బంది అందరికీ మంత్రి మంగళవారం ఒక ప్రకటనలో ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. కరోనా నుంచి త్వరగా బయటపడేలా చూడాలని, ప్రజలందరిపై మీ ఆశీర్వాదం ఉండేలా చూడాలని అమ్మవారిని ప్రార్థించారు. బోనాల వేడుకలను ప్రతిసారి అంగరంగ వైభవంగా నిర్వహించేవారమని కరోనా నేపథ్యంలో బోనాలు సందడి లేకుండానే జరిగాయన్నారు.

# 25న బంద్‌కు మావోయిస్టుల పిలుపు

హైదరాబాద్,జూలై21(ఆర్ఎన్ఎ): సీపీఐ(మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఈ నెల 25న తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చింది. కవి వరవరరావుతో పాటు ఇతరులను వెంటనే జైలు నుండి విడుదల చేయాల్సిందిగా డిమాండ్ చేసింది. అదేవిధంగా అటవీ ప్రాంతాల నుంచి గ్రే హౌండ్స్ సిబ్బంది వెనక్కి వెళ్లాల్సిందిగా పేర్కొంది. మావోయిస్టు పార్టీ తెలంగాణ స్టేట్ కమిటీ అధికార ప్రతినిధి జగన్ ఈ మేరకు లేఖను విడుదల చేశారు. భీమా కోరెగావ్ సంఘటనలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వరవరరావు, ఇతరులను విడుదల చేయాలని అదేవిధంగా రాజకీయ ఖైదీలందరినీ, 60 ఏళ్లు పైబడిన ఖైదీలను విడుదల చేయాలని ప్రజలు డిమాండ్ చేయాల్సిందిగా పేర్కొన్నారు.

# 22 నుంచి 26 వరకు పుస్తకాల పంపిణీ

### పుస్తకాల పంపిణీలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం: సబిత




చేవెళ్ల మండలం కౌకుంట్ల గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి. చిత్రంలో జడ్పీ చైర్ పర్సన్ తీగల అనిత హరనాథ్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఉన్నారు

రంగారెడ్డి,జూలై21(ఆర్ఎన్ఎ): పాఠ్య పుస్తకాల పంపిణీలో ప్రజా ప్రతినిధులు భాగస్వాములు కావాలని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాలోని చేవెళ్ల మండలం కౌకుంట్ల గ్రామంలో రూ.30 లక్షల రూపాయల జడ్పీ నిధులతో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు జడ్పీ చైర్ పర్సన్ తీగల అనిత హరనాథ్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. రేపటి నుంచి ప్రారంభం అయ్యే పాఠ్య పుస్తకాల పంపిణీలో శాసనసభ్యులు, ఎంపీలు, జడ్పీ చైర్ పర్సన్ లు, ఎమ్మెల్సీలు, ఎంపీపీ, జడ్పీటీసీలు, సర్పంచ్ లు ఎంపీటీసీలు, సహకార సొసైటీ చైర్మన్ లు, విద్యా కమిటీ చైర్మన్ లు సభ్యులు పాల్గొని పంపిణీ చేయాలన్నారు. ఈ నెల 22 నుంచి 26 వరకు జరిగే పంపిణీ కోసం ఇప్పటికే పుస్తకాలను ప్రధానోపాధ్యాయులకు, విద్యా కమిటీ లకు అప్పజెప్పినట్లు వివరించారు. పంపిణీ ని కొవిడ్ మార్గదర్శకాలను అనుసరించి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకొని చేపట్టాలని మంత్రి తెలిపారు. విద్యార్థుల తలిదండ్రులు కూడా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని, ప్రతి నెల 339 కోట్ల నిధులు నేరుగా పంచాయతీ లకు విడుదల చేస్తున్నారన్నారు. ప్రణాళిక బద్ధంగా గ్రామాల అభివృద్ధి జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. హరితహారం సందర్భంగా గ్రామాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటినట్లు మంత్రి వివరించారు. అంతకు ముందు హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి , జడ్పీటీసీ మాలతి కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ శివ ప్రసాద్, సర్పంచ్ గాయత్రి, ఎంపీటీసీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేటినిజం
బుధవారం 22-7-2020

# హైకోర్టు ఆదేశాలు చెంపపెట్టు కావాలి

తెలంగాణ వ్యాప్తంగా కరోనా వ్యాధి కట్టడిలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హైకోర్టు మండిపడడం ఈ మధ్యకాలంలో సర్వసాధారణమై పోయింది. రాష్ట్ర ప్రభుత్వ దయా దాక్షిణ్యాల మీద ప్రజల జీవితాలు ఆధారపడి లేవని హైకోర్టు చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో కరోనా దుస్థితికి అద్దం పడుతోంది. నిజానికి ఇంతమంది మంత్రులు, అధికారులు ఏం చేస్తున్నారన్న అనుమానాలు కలుగుతున్నాయి. కరోనా చికిత్స అందించడంలో తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ దాఖలైన పలు ప్రజాహిత వ్యాజ్యాలను మరోసారి విచారించిన సందర్భంగా హైకోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు అధికారులకు చెంపపెట్టు కావాలి. ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేసిన తీరు క్షంతవ్యాం కాదు. నిజానికి ఒక్క హైదరాబాద్‌లో పరిస్థితిని కట్టడి చేయగలిగితే రాష్ట్రమంతా అనుసరిస్తుంది. అధికారులను సమన్వయం చేసుకుని ఆస్పత్రుల్లో సౌకర్యాలు కల్పిస్తూ వైద్యులను ప్రోత్సహిస్తూ ముందుకు సాగివుంటే పరిస్థితిపై హైకోర్టు సీరియస్‌గా తీసుకునేది కాదు. అందుకే రాజ్యాంగ బద్దంగా కల్పించిన హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హైకోర్టు వ్యాఖ్యలు చేయాల్సి వచ్చింది. ప్రభుత్వ ఉదాసీన వైఖరితో ప్రజలకు సరైన వైద్యం అందక జీవించే హక్కు కాలరాయబడుతోందని, ఇటువంటి తీవ్రమైన సమయంలో న్యాయస్థానం చూస్తూ ఊరుకోదని హెచ్చరించింది. కేంద్రం, ఐసీఎంఆర్ తమ మార్గ దర్శకాలు పాటించాలంటూ పదేపదే చెబుతున్నా అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే చేయిదాటిపోతుందని ఆందోళన వ్యక్తం చేసింది. నేరుగా అధికారులపై చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే వారు ఎంత బాధ్యతారహితంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ప్రతి విషయం లో ముందుండే మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ కనీసం నగర ఆస్పత్రుల్లో సౌకర్యాలను పట్టించుకోక పోవడం సరికాదు.

ఇవన్నీ మిక్కుటమయ్యాకనే హైకోర్టు జోక్యం చేసుకుంది. పదేపదే హెచ్చరికలు చేయాల్సి వచ్చింది. వెంటనే తమ ఆదేశాలను అమలు చేయాలని, ఈనెల 28 నాటికి తమ ఆదేశాలపై తీసుకున్న చర్యలను... ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి, మునిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ కె.రమేష్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్‌లు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్, జస్టిస్ బి.విజయసేన్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం సోమవారం ఆదేశాలు జారీచేసింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌నే తీసుకుంటే ఇద్దరు మంత్రులు, ఓ డిప్యూటి స్పీకర్ ఇక్కడ ఉన్నారు. ముగ్గురిలో ఇద్దరికి కరోనా సోకి కోలుకున్నారు.

ఆస్పత్రుల్లో సౌకర్యలు లేవని ప్రజలు పదేపదే వాపోతున్నా ఈ ముగ్గురు చేవచ్చి ఉన్నారని చెప్పక తప్పదు. నిజానికి ఏ జిల్లాకు ఆ జిల్లా మంత్రి కథానాయకుడై కరోనా కట్టడికి వైద్య సేవలను విస్తృతం చేసి ఉంటే ఈ దుస్థితి వచ్చేది కాదు. కానీ మంత్రులు, అధికారులు అంతా కలసి ఉద్యమనేత సిఎం కెసిఆర్‌కు అప్రతిష్ట తెచ్చేలా, హైకోర్టు మొట్టికాయలు వేసేలా చేస్తున్నారు. ఎవరికి వారు ఆస్పత్రులపై బాధ్యతా యుతంగా పనిచేసి వుంటే ఈ దుస్థితి వచ్చేది కాదు. కరోనా కేసులు పెరుగుతూ ఉండడం, ఆస్పత్రుల్లో ఆక్సిజన్ లించడం లేదన్న ఆరోపణలపై ఏ ఒక్క మంత్రి కూడా క్షేత్రస్థాయిలో పరిశీలన చేయలేదు. అధికార యంత్రాంగం కూడా పట్టించుకోలేదు. మొత్తంగా హైకోర్టు పెట్టిన చివాట్లు ఇప్పుడు నేరుగా సిఎం కెసిఆర్‌కు తాకుతాయి. అంటే వ్యక్తిగతంగా సిఎం కెసిఆర్ ప్రతిష్ట మాత్రమే దెబ్బతింటుంది.

ఓ రకంగా మంత్రులు, అధికారులు కలసి ఉద్యమనేత ఆకాంక్షలను తుంగలో తొక్కారనే చెప్పాలి. కరోనా రోగులతో కలిసిన వారి అంటే సెకండరీ కాంటాక్ట్ వివరాలు వెల్లడించాలని,వారికి 5వ, 10వ రోజు పరీక్షలు చేసి ఆ వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచండని హైకోర్టు ఆదేశించింది. వైద్య, ఆరోగ్య శాఖ వెబ్‌సైట్‌ను వెంటనే పునరుద్దరించమని ఆదేశించింది. వైద్యం అందించే ఆసుపత్రుల వివరాలు, అందుబాటులో ఉన్న బెడ్స్ కేటగిరీ వారీగా వెల్లడించాలని పేర్కొంది. వెంటిలేటర్‌తో కూడిన బెడ్స్, ఆక్సిజన్‌తో కూడిన బెడ్స్, సాధారణ బెడ్స్ ఏ ఆసుపత్రిలో ఎన్ని అందుబాటులో ఉన్నాయో అన్ని భాషల్లో ప్రముఖంగా కనిపించేలా అందులో ఉంచాలంది. అలాగే ఈ సమాచారాన్ని విస్తృతంగా ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలియజేయమని ఆదేశించింది. నిజానికి ఇవన్నీ కేవలం అధికారులు చేయాల్సిన పనులు మాత్రమే. వారు బాధ్యతాయుతంగా పనిచేసి ఉంటే ఈ పరిమాణామాలు వచ్చేవి కావు. సక్రమంగా వారు పనిచేసి ఉంటే కరోనా రోగులకు భరోసా దక్కేది. రోజులు గడిచినకొద్దీ ఇంకా అరకొర సమాచారమే ఇస్తున్నారు. ప్రజలకు వారికి సమీపంలోని ఏ ఆసుపత్రిలో బెడ్స్ అందుబాటులో ఉన్నాయో తెలిస్తే వారు అక్కడికి వెళ్లి చికిత్స పొందే అవకాశం ఉంటుంది.

వెంటనే ఈ సమాచారాన్ని ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలి. పరీక్షా కేంద్రాలు ఎక్కడున్నాయి? ఏ ల్యాబ్‌లో ఎన్ని ర్యాపిడ్ యాంటిజెన్ టెస్టింగ్ కిట్స్ అందు బాటులో ఉన్నాయో వెల్లడించాల్సి ఉంది. ఈ సమాచారంపై తక్షణమే అధికారులు రంగంలోకి దిగాలి.

వైద్యారోగ్య శ్శాఖ మంత్రి ఈటెల రాజేందర్ సహా, అన్ని జిల్లాల్లో ఆయా జిల్లాల మంత్రులు బాధ్యత తీసుకోవాలి. వైద్యాధికారులు తోణం యాక్టివ్ కావాలి. హైకోర్టు ఆదేశాలను సీరియస్‌గా తీసుకోవాలి. ప్రజల సేవకోసమే మేమంతా ఉన్నామని గుర్తించి పనిచేయాలి. రోజూ ఇచ్చే మెడికల్ బులెటిన్‌లోనూ ఈ సమాచారాన్ని చేర్చాలి. అలాగే ప్రజలు ఫిర్యాదు చేసేందుకు ప్రస్తుతం ఉన్న వాట్యాప్ నెంబర్ 9154170960ను ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయండని హైకోర్టు చేసిన సూచనలను తక్షణం అమల్లోకి తీసుకుని రావాలి.

## భారీవర్షాలతో చెరువులకు జలకళ

కొత్తగూడెం,జూలై21(ఆర్ఎన్ఎ): జోరువానల వల్ల జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు పూర్తిగా నిండిజలకళ ఉట్టిపడుతోంది. కొత్తగూడెం, పాల్వంచ మండలాల్లోని పలు వరదనీటితో పూర్తిగా నిండిపోయాయి. మణుగూరు, పినపాక, కరకగూడెం, అశ్వాపురం, బూర్గంపాడు, ఇల్లెందు, టేకులపల్లి మండలాల్లో భారీ వర్షం వల్ల చెరువులు, కుంటలు నిండిపోయాయి. జిల్లాలోని అతిపెద్ద ప్రాజెక్టుగా ఉన్న తాలిపేరు రిజర్వాయర్ నీటి సామర్థ్యానికి చేరువలో ఉంది. భారీ వర్షాల ప్రభావం వల్ల వరదనీరు చెరువులు, కుంటల్లోకి చేరడంతో పూర్తిగా నిండి పోయాయి. జిల్లాలోని సుమారు 200 మిషన్‌కాకతీయ చెరువులు జలకళను సంతరించుకున్నాయి. మిగతా 250 చెరువుల్లో సైతం వరదనీరు చేరింది. తాలిపేరు ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా భారీ వరదనీరు చేరింది. అశ్వారావుపేట మండలంలోని అతిపెద్ద సాగునీటి ప్రాజెక్టుగా ఉన్న పెద్దవాగుకు వరదనీరు వచ్చి చేరుతోంది. పాల్వంచ మండలంలోని కిన్నెరసాని ప్రాజెక్టు నిల్వకు చేరుకునే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. జోరు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఏజెన్సీకి జలకళ ఉట్టిపడుతోంది. పలు ప్రాంతాలు నీటితో నిండిపోతున్నాయి. ఎగువున ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో దిగువ భాగంలో ఉన్న తాలిపేరు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వస్తోంది. వర్షాలు ఇలాగే ఉంటే భద్రాద్రి వద్ద గోదావరి ఉరకలు వేసే అవకాశం ఉంది.

ఇటీవలి వర్షాల కారణంగా సింగరేణి వ్యాప్తంగా ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనుల్లో ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు ఏరియాల్లోని ఆరు ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనుల్లో బొగ్గు ఉత్పత్తి జరగలేదు.

## హరితహారంలో అందరూ పాల్గొనాలి

### -అటవీ అధికారి వినతి

ఆదిలాబాద్,జూలై21(ఆర్ఎన్ఎ): హరితహారంలో భాగంగా అధికారులు, ప్రజలు నాటిన మొక్క రక్షణ బాధ్యత కూడ తీసుకోవాలని జిల్లా అటవీ అధికారి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాలుగో హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో లక్ష్యానికి మించి మొక్కలను నాటి జిల్లాకే ఆదర్శంగా నిలవాలన్నారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటి, సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. వదిలేస్తే ఖర్చు వృథా అవుతుందన్నారు. అధికారులు వివిధ కార్యాలయాల్లో, ప్రజలు ఇళ్లలో, విద్యార్థులు పాఠశాలల్లో, నాయకులు గ్రామాల్లోని వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటడంతో పాటు, వాటికి రక్షణ కంచెలను ఏర్పాటు చేయాలని కోరారు. నాటిని మొక్కలను రక్షించినప్పుడే హరితహారం విజయవంతమవుతుందని గుర్తు చేశారు. అటవీశాఖ ఆధ్వర్యంలో రక్షణ కంచెలను అందుబాటులో ఉన్నాయన్నారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటించనున్నామని తెలిపారు. ఈ మొక్కలకు రక్షణ కంచెలను ఏర్పాటు చేయడంతో పాటు, వాటి రక్షణ బాధ్యత కూడా తీసుకోవాలని అటవీ సిబ్బందికి ఆదేశించారు. హరితహారం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని పేర్కొన్నారు. గ్రామంలో ప్రతి ఇంటి వద్ద ఐదు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలన్నారు.

అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతోనే లక్ష్యాన్ని అధిగమించవచ్చునన్నారు. మొక్కలు అవసరం ఉన్నవారు గ్రామచాయితీ కార్యాలయంలో సంప్రదించి, అందుబాటులో ఉన్న మొక్కలను తీసుకెళ్లాలని సూచించారు. పోలంగట్లపై మొక్కలను నాటాలని తోటి రైతులకు మొక్కలను అందజేయాలన్నారు.

## 60 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ఖమ్మం,జులై 21: జిల్లాలోని కూసుమంచి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి 60 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆదుకుంటున్నారని తెలిపారు.

సబ్బండ వర్ణాల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తుండటంతో ప్రజల్లో ఆయనపై గౌరవం పెరిగిందన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమం ఏకతాటిపై కొనసాగుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రెండోరోజూ కొనసాగిన పాడిరైతుల ఆందోళన

ముంబై,జూలై21(ఆర్ఎన్ఎ): పాల ధరలు పెంచాలని డిమాండ్ చేస్తూ మహారాష్ట్ర పాడి రైతులు రెండో రోజుమంగళవారం కూడారాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కొనసాగించారు. పాలపొడి ఎగుమతిని నిషేధించాలని కోరుతూ అదేవిధంగా పాల సేకరణ ధరలను పెంచాలని డిమాండ్ చేస్తూ పాడి రైతులు సోమవారం నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నిరసనలు చేపట్టారు. కిసాన్ సభతో పాటు స్వాభిమాని శెట్‌కరి సంఘటనా (ఎస్ఎస్ఎస్) ఈ ఆందోళనకు నాయకత్వం వహిస్తుంది. ముంబై, దాని పరిసర ప్రాంతాల్లో పాడి రైతుల నిరసన ప్రభావాన్ని చూపిస్తుంది. ప్రభుత్వ పాడి పరిశ్రమలకు ఈ రైతులు పాలను సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ఇస్తున్న లీటరు పాలకు రూ .16-17 ను రూ. 30కి పెంచాల్సిందిగా డిమాండ్ చేస్తున్నారు. కోవిడ్-19 మహమ్మారి కారణంగా విధించిన లాక్‌డౌన్ నేపథ్యంలో పాడి పరిశ్రమలు పాల సేకరణ ధరలను లీటరు పాలకు రూ. 25-30 నుండి తగ్గించాయని రైతులు తెలిపారు. కాగా లాక్‌డౌన్ కారణంగా పాల వినియోగం తగ్గిందని పాడి పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ప్రతిరోజు రైతుల నుంచి పాడి పరిశ్రమలు రాష్ట్రవ్యాప్తంగా 1.40 కోట్ల లీటర్ల పాలను సేకరిస్తాయని అంచనా. 10 వేల టన్నుల పాలపొడిని దిగుమతి చేసుకోవాలన్ననిర్ణయాన్ని కేంద్రం రద్దు చేసుకోవాలని ఆందోళన సందర్భంగా పాడి రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# జాతి జాగృతికి ప్రతీక - భారత జాతీయ పతాక

### (22 జూలై జాతీయ పతాక ఆమోద దినం సందర్భంగా)

జాతీయ జెండా రెపరెపలే జాతి గుండె చప్పుడు. దేశ ఔన్నత్యమంతా జాతీయ పతాక గౌరవంలో ఇమిడి ఉంటుంది. భారతదేశ జాతీయ పతాకానికి వందనం చేయడం తమ అదృష్టంగా భావించేవారంతా దేశభక్తులుగా కొనియాడబడతారు. మన తెలుగు వాడు, మచిలీపట్నం వాసి పింగళి వెంకయ్య రూపొందించిన ప్రస్తుత త్రివర్ణ పతాకాన్ని స్వాతంత్ర్యానికి కొద్ది రోజుల ముందు 22 జూలై 1947 రోజున భారత రాజ్యాంగ పరిషత్ ఆమోదించగా, 15 ఆగష్టు 1947న భారత ప్రభుత్వ అధికారికంగా ఆమోదించింది. నేటి జాతీయ పతాకాన్ని ఆమోదించిన రోజుగా 22 జూలై రోజున భరతజాతి "జాతీయ పతాక ఆమోద దినం"గా వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. దీర్ఘచతురస్రాకారంలో ఉన్న జాతీయ పతాకంలో పైభాగాన కాషాయం, మధ్యలో తెలుపు, క్రింది భాగాన ఆకుపచ్చ రంగులు సమ నిష్పత్తిలో ఉంటూ, మధ్యలో నేవీ బ్లూ రంగులో అశోక చక్రం అందంగా అమర్చబడి ఉంటుంది. ఈ చక్రంలో 24 స్పోక్స్ (చువ్వలు) ఉంటాయి. ప్రతి దేశం తనదైన విలక్షణ జాతీయ జెండాను కలిగి ఉంటుంది.

1906లో మె?దటిసారి క్రింది భాగాన ఎరుపు, మధ్యలో పసుపు మరియు పై భాగాన ఆకుపచ్చ రంగులు కలిగిన అనధికారిక దేశ పతాకాన్ని 07 ఆగష్టు 1906న కలకత్తా గ్రీన్ పార్క్ వద్ద ఎగురవేశారు. 1907లో రెండవ పతాకంగా పైన కాషాయం, మధ్య పసుపు మరియు క్రింద ఆకుపచ్చ వర్ణాలు కలిగిన జెండాను బెర్లిన్ కమిటీ రూపొందించింది. 1917లో స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా మూడవ రూపంతో పతాకాన్ని డా: అన్నీ బిసెంట్ మరియు లోకమాన్య తిలక్‌లు ఎగురవేశారు. ఈ పతాకంలో ఐదు ఎరుపు మరియు నాలుగు ఆకుపచ్చ సమాంతర చారలతో ఏడు నక్షత్రాలు, ఎడమ పైభాగాన యూనియన్ జాక్ సంకేతం ఉంటాయి. 1921లో బెజవాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో పింగళి వెంకయ్య రూపొందించిన 30 పతాక నమూనాలలోంచి నాలుగవ పతాకాన్ని అనధికారికంగా ఆమోదించారు. దీనిలో పైన ఆకుపచ్చ మరియు క్రింద ఎరుపు రంగులు (హింధూ ముస్లింలకు సూచనగా) సమానంగా ఉంటూ, మధ్యలో ఛరకా(రాట్నం) చేర్చబడింది. ఐదవసారి 1931లో తీసుకున్న నిర్ణయం ప్రకారం పింగళి వెంకయ్య రూపొందించిన త్రివర్ణాలతో కూడిన పతాకం మధ్య భాగాన ఛరకా చేర్చబడింది. దేశ స్వాతంత్ర్యానికి కొద్ది రోజుల ముందు పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ జెండాను ఆరవ అంతిమ ప్రస్తుత రూపంగా 22 జూలై 1947న త్రివర్ణ పతాకానికి మధ్యలో అశోకుడి ధర్మ చక్రం చేర్చి ఆమోదించడం జరిగింది. గత 114 ఏళ్లలో ఆరుసార్లు మార్పు చెందిన ప్రస్తుత జాతీయ పతాకం చూసిన ప్రతి ఒక్కరు మరుక్షణమే అనిర్వచనీయ అనుభూతులలో మునగడం మనందరికి అనుభవమే కదా.

చేనేత వస్త్రంతో మాత్రమే చేయబడిన భారత జాతీయ పతాకం 2:3 నిష్పత్తి కలిగిన దీర్ఘచతురస్రాకారంలో ఉంటుంది. పతాకంలోని కాషాయ రంగు దేశ సామర్థ్యం, త్యాగం మరియు ధైర్యాన్ని సూచిస్తుంది. మధ్యలోని తెలుపు వర్ణం శాంతి, స్వచ్ఛత మరియు సత్యాలను తెలుపుతుంది. జెండా మధ్య భాగాన ఉన్న అశోక చక్రం ధర్మ సూత్రాలను జీవ చైతన్యాన్ని మరియు గమనాన్ని వ్యక్త పరుస్తుంది. దిగువన గల ఆకుపచ్చ వర్ణం దేశ హరిత సంపదల అభివృద్ధిని సూచిస్తుంది. వివిధ జాతీయ పర్వదినాలు మరియు ఇతర ముఖ్య సందర్భాలలో కార్యాలయాలు, సంస్థలు మరియు విద్యాలయాలలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పిస్తూ విద్యార్థులలో జాతీయతాభావం మరియు దేశభక్తిని రగుల్చుట జరుగుతుంది. ప్రతి దేశభక్తుడు తన ఇంటి ఆవరణలలో కూడా జాతీయ పతాకాన్ని ఎగురవేయవచ్చనే కోడ్ సవరణను 22 జనవరి 2002 రోజున చేయడం జరిగింది. 2005లోమరోసారి కోడ్‌ను సవరించని మరికొన్ని అదనపు వాడుకలను అనుమతించింది. సూర్యోదయం నుండి సుర్యాస్తమయం వరకు జెండాను ఎగురవేసి ఉంచవచ్చునని, మతపరమైన సందర్భాలలో వాడకూడదని నిర్ణయించారు. జాతీయ పతాకాన్ని నేలకు లేదా నీటిలో పడకుండా జాగ్రత్త పడాలి. జాతీయ పతాకం కన్న ఎత్తైన ఇతర జెండాలు అమర్చడం చట్ట వ్యతిరేకమని గుర్తుంచుకోవాలి. జాతికి గర్వకారణంగా నిలిచే త్రివర్ణ జాతీయ పతాకం ప్రజల ఆశలను మరియు ఆకాంక్షలను ప్రకటిస్తూనే, జాతీయతా భావాన్ని ఉత్తేజ పరుస్తుంది. భరతజాతి ఉన్నంతకాలం జాతీయ పతాకానికి గౌరవ వందనం చేస్తూ, దాని ప్రతిష్టను ఇనుమడింపజేయడం భారత పౌరులుగా మనందరి కనీస బాధ్యత. జై హింద్.

# దేశంలో విస్తృతంగా కరోనా వ్యాప్తి

### సామాజికి వ్యాప్తి దశలో ఉన్నామంటున్న నిపుణులు
### ప్రజల్లో చైతన్యంతోనే కట్టడి సాధ్యమని సూచనలు

న్యూఢిల్లీ,జూలై 21(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా వ్యాధి తీవ్రతను గుర్తిస్తే సామాజిక వ్యాప్తిలో ప్రస్తుతం ఉన్నామని అర్థం చేసుకోవచ్చు. ఇంతకాలం కాంటాక్ట్ కేసులను తవ్వితీసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇప్పుడు సర్వ్యాప్తి అయ్యింది. కరోనా కేసుల వ్యాప్తి కమ్యూనిటీ స్ప్రెడ్ అవుతోందని సూచాయగా ఎయిమ్స్ డైరెక్టర్ వెల్లడించారు. దేశంలో ప్రస్తుతం రోజుకు 40 వేల వరకు కరోనా కేసులు నమోదవుతుండటం చూస్తుంటే సామాజిక వ్యప్తిని కొట్టి పారేయలేం. బాధితుల సంఖ్య 11 లక్షలు దాటడంతో వ్యాధి విషయంలో భారత్ సామాజిక వ్యాప్తి దశకు చేరుకున్నట్లేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దేశంలో ఒక్క లక్షద్వీప్‌ను మినహాయించి మిగిలిన ప్రాంతాలన్నింటిలోనూ కరోనా కేసులు నమోదవుతున్నాయి. కనీసం 27 రాష్ట్రాల్లో రోజుకు వెయ్యికిపైగా కొత్త కేసులు నమోదవుతుండటం, అతితక్కువ కేసులు ఉన్న అండమాన్ నికోబార్‌లోనూ వాటి సంఖ్య 150కు చేరుకోవడంతో సామాజిక వ్యాప్తి విషయమై సర్వత్రా చర్చ మొదలైంది. వ్యాధుల నిపుణుల అంచనాల మేరకు దేశంలో సామాజిక వ్యాప్తి ఇప్పటికే మొదలైంది. కానీ ఇప్పటివరకూ కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ విషయాన్ని ఒప్పుకోవడం లేదు. సామాజిక వ్యాప్తి అనేది లేనేలేదని అంటోంది. అయితే దీనిపై కేంద్రమే సమాధానం ఇవ్వాలని ఢిల్లీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యేంద్ర జైన్ వ్యాఖ్యానిం చారు. ఇప్పుడున్న దశలో ఇక ప్రజలను చైతన్యం చేసి వారిని హెచ్చరిం చాల్సి ఉందని నిపుణులు అంటున్నారు. వారిని హెచ్చరిక చేసి కట్టడి చేయాలంట ఎన్నారు. కరోనా వైరస్ పుట్టినిల్లు అయిన చైనాలోని వూహాన్ నుంచి కొంత మంది విద్యార్థులు దేశంలోకి వచ్చిన తరువాత ఇక్కడ వ్యాధి మొదలైంది. ఆ సమయంలో విదేశాల నుంచి వచ్చిన ప్రతి ఒక్కరినీ పరీక్షించడం, వైరస్ ఉన్న వారిని వేరు చేసి చికిత్స అందించడంతో పాటు ఆయా వ్యక్తులు ఎవరెవరితో సంబంధాలు పెట్టుకున్నారన్న విషయాన్ని ఆరా తీసి వారందరికీ పరీక్షలు నిర్వహించారు. దీంతో వ్యాధి ఎవరి నుంచి ఎవరికి సోకిందో స్పష్టంగా తెలిసింది. అంతేకాకుండా వ్యాధిని అక్కడికక్కడే కట్టడి చేసేందుకు అవకాశమేర్పడింది. అయితే సమయం గడుస్తున్న కొద్దీ వ్యాధిని వ్యాప్తి చేస్తున్న వారు ఎవరన్నది గుర్తించి తెలుసుకోవడం కష్టమైంది. ఇలా ఎవరి నుంచి ఎవరికి వ్యాధి సోకిందో కచ్చితంగా నిర్ధారించలేని స్థితిని చేరుకున్నాం. దేశంలోని 11 లక్షల నిర్ధారిత కోవిడ్ కేసులను నిశితంగా పరిశీలిస్తే సామాజిక వ్యాప్తి ఉందన్నది స్పష్టంగా తెలిసిపోతుందని వైద్య నిపుణులు అంటున్నారు. హైదరాబా-ద్‌లోని ప్రముఖ పరిశోధన సంస్థల శాస్త్రవేత్తలు కూడా అనధికారికంగా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. కొంతకాలం క్రితం భారత వైద్య పరిశోధన మండలి దేశవ్యాప్తంగా సర్వే నిర్వహించిందని, తీవ్రమైన శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్న వారిపై జరిగిన ఈ సర్వేలో 40 శాతం మంది సమస్యకు కారణమేమిటో స్పష్టంగా చెప్పలేకపోయారని, ఇది సామాజిక వ్యాప్తికి సూచికేనని వారు చెబుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా సామాజిక వ్యాప్తిని అంగీకరించడం మేలని దేశంలోనే ప్రముఖ వ్యాధుల నిపుణులు అంటున్నారు. వ్యాధిని కట్టడి చేయడంలో విఫలమయ్యాయన్న నిందను భరించాల్సి వస్తుందని ప్రభుత్వాలు సామాజిక వ్యాప్తిని నిరాకరిస్తూ ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. అయితే ప్రభుత్వం అంగీకరించినా, అంగీకరించకపోయినా వ్యాధి కట్టడి, చికిత్స విషయంలో ఎలాంటి మార్పులూ ఉండబోవన్నారు. పరీక్షలు చేయడం, వ్యాధిగ్రస్తులను గుర్తించి ఇసోలేషన్‌లో ఉంచడం, చికిత్స కల్పించడమే మన ముందున్న మార్గమన్నారు. ప్రజలు కూడా మునుపటి లాగానే తరచూ చేతులు కడుక్కోవడం, ముఖానికి మాస్క్ వేసుకోవడం, వీలైనంత వరకు జనసమర్ధ ప్రాంతాలకు వెళ్లకపోవడం మంచిదని సూచించారు.

# మొక్కల పెంపకంపై ప్రోత్సాహం

### -ఆకుపచ్చ తెలంగాణ లక్ష్యంగా ముందుకు: ఎర్రబెల్లి

జనగామ,జూలై 21(ఆర్ఎన్ఎ): వర్షాలు కురుస్తున్నందున అనుకూల వాతావరణం ఏర్పడిందని, అందువల్ల పల్లెల్లో, రహదారుల వెంట ఉద్యమంలా మొక్కల పెంపకాన్ని జోరుగా చేపట్టాలని ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్ రావు పేర్కొన్నారు. ప్రభుత్వం ఆకుపచ్చ తెలంగాణే ధ్యేయంగా పనిచేస్తుందని చెప్పారు. ఖాళీ ప్రదేశాలు, స్థలాలలో విరివిగా మొక్కలు నాటి ఆకుపచ్చ తెలంగాణకు బాటలు వేయాలని కోరారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి హరితహారాన్ని విజయవంతం చేయాలని కోరారు. మొక్కలు జీవకోటికి ఆధారమని, ప్రతిఒక్కరు మొక్కలు నాటి హరితతెలంగాణకు పాటుపడాలని కోరారు. పాలకుర్తి నియోజక వర్గంలో ఎమ్మెల్యే అధికారులను కలుపుకుని హరితహారంలో విస్తృతంగా మొక్కలు నాటుతూ యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. నాలుగో విడత హరితహారం ఉద్యమంలా కొనసాగాలన్నారు. ఇప్పటి వరకు లక్షలాది మొక్కలను నాటడం జరిగింది. మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. హరితహారం ద్వారా భావితరాల భవిష్యత్ బాగుంటుందనన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమం నిరంతరంగా కొనసాగింది. ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తెలియ జెప్పాలని, ఆ దిశగా ప్రతి కార్యకర్త పనిచేయాలని అన్నారు. ఒక ప్రణాళికా ప్రకారం ముందుకు సాగాలని అన్నారు. ప్రతి కార్యకర్త బాగా కష్టపడి టీఆర్ఎన్ పార్టీ జెండాను రెపరెలాడించాలని అన్నారు. గత ప్రభుత్వాలపాలనలో ఏళ్లపాటు సాధ్యంకాని అభివృద్ధిని, తెలంగాణ ప్రభుత్వం ఈ ఆరేళ్లలోనే ప్రజలకు అందించిందని తెలిపారు. ప్రభుత్వపథకాల ద్వారా ఒక కుటుంబం ఏదోవిధంగా ప్రభుత్వ ఫలాలు పొందుతున్నారని, వారికి వాటి గురించి తెలిపాలని సూచించారు.

## మాజీ ఎమ్మెల్యే మృతికి బాబు సంతాపం

విజయనగరం,జూలై21(ఆర్ఎన్ఎ): విజయనగరం జిల్లా కురుపాం మాజీ ఎమ్మెల్యే జనార్థన్ థాట్రాజ్ అనారోగ్యంతో మృతి చెందారు. గుండెపోటుతో విశాఖపట్నంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈరోజు ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. జనార్థన్ థాట్రాజ్ మృతి పట్ల తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సంతాపం వ్యక్తం చేశారు. కురుపాం నియోజకవర్గంలో, విజయనగరం జిల్లాలో తెదేపా బలోపేతానికి విశేష కృషి చేశారన్నారు. థాట్రాజ్ మృతి తెదేపాకు తీరని లోటని ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# పేదల సంక్షేమమే లక్ష్యం

### -కరోనాపై విపక్షాల దుష్ప్రచారం: ఎమ్మెల్యే

సిద్దిపేట,జూలై21(ఆర్ఎన్ఎ): పేదల సంక్షేమమే ధ్యేయంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని దుబ్బాక ఎమ్మెల్యే రామలింగారెడ్డి అన్నారు. కరోనాపై తక్షణ చర్యలు తీసుకుంటున్నా విపక్షాలు గోరంతలు కొండంతలు చేస్తున్నాయని మండిపడ్డారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని, గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ స్థాయి దవాఖానల్లో చికిత్స చేయించుకున్న బాధితులు, సంబంధిత బిల్లులతో సీఎంఆర్ఎఫ్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు లబ్ధి జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతంలోని బడుగు బలహీ న వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఆడపడుచులకు వరంగా మారాయన్నారు. ఈ పథకంలో అమల్లో ఉండడంతో రాష్ట్ర వ్యాప్తంగా నిరుపేద కుటుంబాలు ఎంతో సంతోషంగా ఉన్నాయన్నారు. విద్య, వైద్యరంగంతో పాటు అన్ని రంగాల్లో మార్పులు చేసి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ప్రత్యేక గురుకులాలను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తోందన్నారు. వ్యవసాయ రంగంలో ఎన్నో మార్పులు చేసి రైతులకు రైతుబంధు పథకంతో పాటు రైతుబంధు బీమా పథకాన్ని కల్పించిందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు నిర్మాణం చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఇండ్లులేని వారిని గుర్తించి డబుల్‌బెడ్ రూం ఇండ్లు నిర్మించి ఆదుకుంటున్నామని అన్నారు. ప్రతి గ్రామపంచాయతీకి ఒక శ్మశాన వాటికలను మంజూరు చేసి నిర్మాణాలు చేపడుతుందన్నారు. మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులకు మరమ్మతులు చేపట్టి రైతుల భూములకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు.

## తెలంగాణ పారిశ్రామిక విధానం భేష్ : చారి

న్యూఢిల్లీ,జూలై21(ఆర్ఎన్ఎ): సులభతర వాణిజ్య ర్యాంకుల్లో తెలంగాణ రాష్ట్రం రెండో స్థానంలో నిలిచిందని ఇది పెట్టుబడులకు ఇస్తున్న ఊతంగా చాడలని మాజీ ఎంపి, ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ ఎస్. వేణుగోపాలచారి అన్నారు. తెలంగాణలో పారిశ్రామిక విధానం ప్రపంచ దేశాలను ఆకర్శిస్తోందని అన్నారు. తాజాగా మంత్రి కెటిఆర్ తీసుకుంటున్న చర్యల వల్ల కరోనా సమయంలోనూ పెట్టుబడులకు అవకాశాలు ఏర్పడ్డాయని అన్నారు. తెలంగాణ వెబ్‌సైట్‌తో పారదర్శక విధానం అమల్లోకి వచ్చిందన్నారు. వివిధ దేశాలు పెట్టుబడుల కోసం తెలంగాణ వైపు చూస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమం సత్ఫలితాలనిస్తుందని, నాలుగేళ్లలో 230 కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకొని ఆ దిశగా ముందుకెళ్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి అన్నారు.ప్రతి ఒక్కరూ హరితహారం విజయవంతం చేయాలని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఈ నిర్ణయం దేశ వ్యవసాయం రంగంలోనే సంచలనం సృష్టించిందని చెప్పారు. రైతులకు పెట్టుబడికి ఏడాదికి ఎకరానికి పదివేలు అందజేయడంపై దేశవ్యాప్తంగా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇతర రాష్ట్రాలు సైతం పథకం అమలుపై ఆలోచన చేస్తున్నాయన్నారు.మిషన్ కాకతీయ, భగీరథ పథకాలు రోల్‌మోడల్‌గా నిలిచాయని, వీటి ద్వారా గ్రామాల్లో చెరువులన్నీ ఆధునికీకరించడంతో పాటు, ఇంటింటికీ శుద్ధజలాలు అందిస్తున్నట్లు చెప్పారు. కల్యాణక్ష్మి, షాదీముబారక్, ఆసరా పింఛన్లు పథకాలతో పాటు ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి అందిస్తూ నిరుపేద కుటుంబాలను ఆదుకుంటున్నట్లు తెలిపారు.

## మంచిర్యాల ఐబి చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్

### -ప్రారంభించిన కలెక్టర్



మంచిర్యాల,జూలై21(ఆర్ఎన్ఎ): ఎన్నో ఏండ్ల పట్టణ ప్రజల కల నేరవేరింది. ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో పట్టణంలో తరచూ ప్రమాదాలు సంభవించేవి. ప్రమాదాలకు చెక్ పెడుతూ పట్టణంలో ఐబీ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిగ్నల్ సిస్టాన్ని మంచిర్యాల కలెక్టర్ భారతి హోలికేరి, రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీసు సత్యనారాయణ, మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భారతి హోలికేరి మాట్లాడుతూ.. మంచిర్యాల పట్టణ కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్ ప్రారంభించినట్లు తెలిపారు. మంచిర్యాల పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉండటం వలన డీఎంఎఫ్ టీ ఫండ్స్ నుంచి రూ. 6 లక్షలు ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు కోసం కేటాయించామని పేర్కొన్నారు. మంచిర్యాల లాంటి పెద్ద పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యలు ఉండకూడదని, రోడ్డు ప్రమాదాల వల్ల చాలా మంది ప్రాణాలు కోల్పోతు న్నారని ఆవేదన వ్యక్తం చేవారు. ప్రమాదాలు తగ్గించాలనే ఉద్దేశంతో ట్రాఫిక్ సిగ్నల్, రోడ్ డివైడర్ ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. రామగుండం సీపీ సత్యనారాయణ మాట్లడుతూ.. మంచిర్యాల జిల్లా కేంద్రంగా ఏర్పాటైన నాటి నుంచి అధిక వాహనాల రాకపోకలు ,రద్దీ కారణంగా జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని పోలీస్ శాఖ ట్రాఫిక్ సిగ్నల్స్ ను ఏర్పాటు చేయడానికి నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ నిధుల నంచి రూ. 6 లక్షల తో ఐబీ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ సిగ్నల్స్ వల్ల ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ఒక సిగ్నల్స్ ఏర్పాటుతో 10 మంది ట్రాఫిక్ కానిస్టేబుల్ డ్యూటీకి సమానంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి, ఏసీపీ నరేందర్, మంచిర్యాల ముత్తి లింగయ్య, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐలు పాల్గొన్నారు.

# చైనా చట్రంలో ఇరుక్కున్న ప్రధాని మోడీ

## దేశప్రయోజనాలు దెబ్బతింటున్నా పట్టించుకోని వైనం
## బలవంతుడన్న ఇమేజ్‌తో ప్రజలకు బురిడీ
## ట్విట్టర్ వేదికగా మరోమారు విమర్శలు గుప్పించిన రాహుల్

న్యూఢిల్లీ,జూలై21(ఆర్ఎన్ఎ): చైనా వ్యూహంలో ఇరుకున్న ప్రధాని మోడీ ఓ బలహీనమైన నాయకుడని రాహుల్ గాంధీ మళ్లీ విమర్శల దాడి చేశారు. ఇటీవల చైనాతో ఘర్షణ జరిగిన అంశాన్ని ప్రస్తావిస్తూ.. ప్రధాని మోదీ బలహీనంగా మారినట్లు రాహుల్ ఆరోపించారు. భారత్, చైనా మధ్య ఉన్న ఉద్రిక్తలు కేవలం సరిహద్దు సమస్యగా చూడరాదన్నారు. బోర్డర్ సమస్యతో ప్రధాని మోదీపై వత్తిడి తెస్తున్నారని, మోదీ ప్రతిష్టపై చైనీయులు దాడి చేస్తున్నారని రాహుల్ అన్నారు.తన ట్విట్టర్ ఖాతాలో రాహుల్ ఓ వీడియోను పోస్టు చేశారు. దాంట్లో మోదీ వైఖరిని ఖండించారు. అధికారంలోకి వచ్చేందుకు తానో బలవంతుడినన్న బూటకపు ఇమేజ్‌ను క్రియేట్ చేశారని రాహుల్ విమర్శించారు. బలమైన నేతనన్న అభిప్రాయాల్ని జనంలో మోదీ క్రియేట్ చేయడం అది ఆయన గొప్ప బలం అని రాహుల్ ఆరోపించారు. కానీ ఇప్పుడు అది భారత్‌కు బలహీనంగా మారిందని కాంగ్రెస్ నేత విమర్శించారు. మోదీ ప్రతిష్టకు, చైనా ప్రణాళికలకు ఏ రకంగా సంబంధం ఉంటుందో రాహుల్ తన వీడియోలో వివరించారు. శుక్రవారం కూడా రాహుల్ తొలి వీడియోను రిలీజ్ చేశారు. యావత్ భూమండలాన్ని చేజిక్కించుకోవాలని చైనా ఎత్తుగడలు వేస్తున్నట్లు రాహుల్ తన వీడియోలో ఆరోపించారు. ప్రణాళిక లేకుండా చైనీయులు ఏమీ చేయరని, వారు తమ మదిలో ఓ ప్రపంచాన్ని క్రియేట్ చేసుకున్నారని, దానికి తగినట్లుగా వాళ్లు ఆ ప్రపంచాన్ని తయారు చేసుకుంటున్నారని రాహుల్ అన్నారు. దానిలో భాగమే గదార్, బెల్ట్ రోడ్ అని అన్నారు. వాళ్లు పూర్తిగా భూగ్రహాన్ని మార్చేస్తున్నట్లు రాహుల్ విమర్శించారు. అయితే ఇలాంటి వ్యూహాత్మక సమయంలో.. కీలకమైన గాల్వాన్, డెమ్చోక్, పాన్‌గాంగ్ సరస్సుల వద్ద చైనా తన ప్రాభవాన్ని పెంచుకున్నట్లు రాహుల్ తెలిపారు. మన హైవేల వల్ల వాళ్లు డిస్టర్బ్ అవుతున్నట్లు చెప్పారు. పాకిస్థాన్‌తో కలిసి కశ్మీర్‌లో ఏదైనా చేయాలన్న తపనతో చైనా ఉన్నట్లు రాహుల్ విమర్శించారు. తాము చెప్పినట్లు చెప్పుకుంటే, మోదీ బలమైన నేత అన్న భావాన్ని రూపుమాపేవిధంగా చైనా వ్యవహరిస్తున్నట్లు రాహుల్ ఆరోపించారు. ఇప్పుడు ఇది కీలకమైన దశ అని, ప్రధాని మోదీ దీనికి అంగీకరిస్తారా లేదా అన్నది ముఖ్యమన్నారు. కానీ ప్రధాని మోదీ తన ప్రతిష్ట పట్ల ఆందోళన చెందుతున్నట్లు అర్థమవుతుందని రాహుల్ అన్నారు. చైనీయులు మన భూభాగంలోకి ఎంటర్ అయ్యారు, కానీ ఎవరూ రాలేదని మోదీ అంటున్నారని, అంటే చైనా వత్తిడికి మోదీ తలొగ్గినట్లు అర్థమవుతున్నదని రాహుల్ తెలిపారు. చైనా చెప్పినట్లు మోదీ వింటే, ఆయన ఈ దేశానికి ప్రధాని కాదు అని రాహుల్ విమర్శించారు.

# మోడీది రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుంది: నారాయణ

హైదరాబాద్,జూలై21(ఆర్ఎన్ఎ): అయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసినట్లయితే రాజ్యాంగాన్ని ఉల్లంఘించినట్లే అవుతుందని సీపీఐ జాతీయ నేత నారాయణ వ్యాఖ్యానించారు. సోమవారం ఇక్కడ మీడియాతో మాట్లాడిన ఆయన.. ప్రధాని మోదీ తీరుపై విమర్శలు గుప్పించారు. దేశానికి ప్రధానిగా కాకుండా.. ఒక మతానికి ప్రధానిగా మోదీ వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు.

# పలు ఆలయాల్లో దొంగతనాలు

సిద్దిపేట,జూలై21(ఆర్ఎన్ఎ): జిల్లాలోని తొగుట మండలంలో దొంగల బీభత్సం సృష్టించారు. మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం, మల్లన్న ఆలయం, లింగంపేటలోని పెద్దమ్మ ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. తాళాలు పగల కొట్టి గళ్ళ పెట్టెలలోని సొమ్మును అపహరించారు. దోపిడీని గ్రహించిన సదరు ఆలయాల కమిటీల అధ్యక్షులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దోపిడీపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దొంగలను పట్టుకునేందుకు దర్యాప్తును ముమ్మరం చేశారు.

# పదిమంది రైల్వే పోలీసులకు కరోనా

సికింద్రాబాద్,జూలై21(ఆర్ఎన్ఎ): సికింద్రాబాద్ లో 10 మంది రైల్వే పోలీసులకు కరోనా పాజిటివ్ ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఆ 10 మందికి ఒకేసారి పాజిటివ్ చ్చింది. సీఐతో పాటు మరో 9 మందికి కరోనా పాజిటివ్ వచ్చింది. ప్రస్తుతం వీరందరూ హోం క్వారంటీన్‌లో ఉన్నారు.

# కొన్ని ప్రాంతాల్లోనే కరోనా తీవ్రత

## పరిమిత ప్రాంతాల్లో కమ్యూనిటీ ట్రాన్స్‌మిషన్
## మీడియాతో ఎయిమ్స్ డైరక్టర్ రణ్‌దీప్ గులేరియా

న్యూఢిల్లీ,జూలై21(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా వైరస్ కేసుల సమూహ వ్యాప్తికి సంబంధించిన ఆధారాలు లేవని ఎయిమ్స్ డైరక్టర్ రణ్‌దీప్ గులేరియా తెలిపారు. హాట్‌స్పాట్లుగా మారిన కొన్ని నగరాల్లో మాత్రం కేసులు అధికంగా ఉన్నట్లు చెప్పారు. అయితే ఆయా ప్రదేశాల్లో మాత్రం స్థానిక స్థాయిలో కమ్యూనిటీ ట్రాన్స్‌మిషన్ జరుగుతున్నట్లు ఆయన వెల్లడించారు. మీడియాతో ఇవాళ రణ్‌దీప్ మాట్లాడుతూ.. కొన్ని ప్రాంతాల్లో వైరస్ కేసులు తారాస్థాయికి చేరినట్లు చెప్పారు. ఢిల్లీలో వైరస్ కేసుల సంఖ్య అత్యధిక స్థాయికి చేరి.. ఇప్పుడు తగ్గుముఖం పడుతున్నట్లు తెలిపారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో వైరస్ గరిష్ట స్థాయికి చేరాల్సి ఉందన్నారు. కొన్ని రాష్ట్రాల్లో వైరస్ కేసులు పెరుగుతున్నట్లు చెప్పారు. ఆ రాష్ట్రాలు మరికొంత సమయంలో గరిష్ట స్థాయికి చేరనున్నట్లు తెలిపారు. 18 నుంచి 55 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారిపై మాత్రమే మొదటి దశ వ్యాక్సిన్ ట్రయల్స్ జరుగుతాయని ఎయిమ్స్ డైరక్టర్ వెల్లడించారు. 1125 శ్యాంపిళ్లను సేకరించామని, దాంట్లో 375 మందికి తొలి దశలో పరీక్షిస్తామన్నారు. 12 నుంచి 65 ఏళ్ల మధ్య వయసు ఉన్న 750 మందికి రెండవ దశలో పరీక్షించనున్నట్లు రణ్‌దీప్ తెలిపారు. అమెరికా, ఇటలీ, స్పెయిన్‌తో పోలిస్తే దక్షిణ తూర్పు ఆసియా దేశాల్లో వైరస్ మరణాలు తక్కువ సంఖ్యలో ఉన్నట్లు ఎయిమ్స్ డైరక్టర్ వెల్లడించారు.

# ఆక్సిజన్ అందకనే యువకుడి మృతి

## -కరోనా మృతులకు పదిలక్షలు ఇవ్వాలి: ఉత్తమ్

నల్లగొండ,జూలై21(ఆర్ఎన్ఎ): ఆసుపత్రిలో ఆక్సిజన్ అందక తల్లి కళ్లెదుటే కొడుకు మరణించడం బాధాకరమైన విషయమని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నల్లగొండ ప్రభుత్వాస్పత్రి కరోనా వైరస్ లక్షణాలతో మిర్యాలగూడ మండలం సల్కునూరుకు చెందిన ఓ యువకుడు ఊపిరి ఆడక తల్లి కళ్లెదుటే కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా పలువురిని కదిలించింది. ఈ నేపథ్యంలోనే నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులను ఉత్తమ్ పరామర్శించారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మట్లాడుతూ నల్లగొండ, నిజామాబాద్ ఆసుపత్రుల్లో ఆక్సిజన్, వెంటిలేటర్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కరోనాతో మృతి చెందిన పేదవారికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కరోనాతో పోరాడే ఫ్రంట్ వారియర్లకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. మూఢనమ్మకాల కోసం సెక్రటేరియట్ కూలగొట్టడం న్యాయమేనా అని ప్రశ్నించారు. కరోనాను ఆరోగ్యశ్రీలో చేర్చి ప్రజలపై రూపాయి భారం పడకుండా వైద్యం అందించాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# డిఎంకెకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలకు కరోనా

చెన్నై,జూలై21(ఆర్ఎన్ఎ): తమిళనాడులో ప్రతిపక్ష పార్టీ డీఎమ్‌కేకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు కరోనా బారిన పడ్డారు. వెల్లూరు ఎమ్మెల్యే కార్తీకేయన్, కృష్ణగిరి ఎమ్మెల్యే టీ సెంగుట్టవన్, రాణీ పేట్ ఎమ్మెల్యే ఆర్ గాంధీకి కరోనా సోకినట్లు ఇటీవల జరిగిన పరీక్షల్లో తేలింది. దీంతో డీఎమ్‌కేలో మొత్తం కరోనా పాజిటివ్ ఎమ్మెల్యేల సంఖ్య 8కి చేరుకుంది. గత నెలలో ఎమ్మెల్యే అన్బళగన్ తన పుట్టిన రోజునే కరోనా కారణంగా మృతి చెందిన విషయం తెలిసిందే. ఇక అధికార పక్షానికి చెందిన 9 మంది ఎమ్మెల్యేలు కూడా కరోనా బారినపడ్డారు. వీరిలో నలుగురు క్యాబినెట్ మంత్రులుగా సేవలందిస్తున్నారు. తాజా లెక్కల ప్రకారం..తమిళనాడులో ఇప్పటివరకూ మొత్తం 1.7లక్షలకు పైగా కరోనా కేసులు నమోదయ్యాయి. ఆదివారం ఒక్కరోజే ఏకంగా 4,979 కేసులు వెలుగులోకి వచ్చాయి. రాజధాని చెన్నైలోనే అత్యధికంగా కరోనా కేసులు వెలుగుచూశాయి..

# ఖమ్మం జిల్లాలో అందుబాటులోకి 10వేల ర్యాపిడ్‌యాంటిజెన్ టెస్ట్‌కిట్స్

ఖమ్మం,జూలై21(ఆర్ఎన్ఎ): రోజురోజుకూ పెరిగిపోతున్న కరోనా వ్యాప్తి నివారణ చర్యల్లో భాగంగా రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చొరవతో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు 10వేల ర్యాపిడ్‌యాంటిజెన్ టెస్ట్‌కిట్స్ అందుబాటులోకివచ్చాయి. ఈమేరకు సోమవారం గాంధీచౌక్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో నిర్వహించిన కోవిడ్-19 నిర్ధారణ పరీక్షల కేంద్రాన్ని మంత్రి పువ్వాడ అజయ్ ప్రారంభించారు. అవసరమైర వారికి ర్యాపిడ్ టెస్టులు నిర్వహించనున్నట్టు ఈసందర్భంగా ఆయన తెలిపారు. దగ్గు, జలుబు, జ్వరం, గొంతునొప్పి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ పాపాలాల్, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కలెక్టర్ ఆర్‌వి కర్ణన్, మున్సిపల్‌కమిషనర్ అనురాగ్ జయంతి తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌కు మాజీ ఎమ్మెల్యే 25 లక్షల సాయం అందచేత

హైదరాబాద్,జూలై21(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ నియంత్రణ కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు అండగా నిలిచేందుకు సంగారెడ్డి నియోజక వర్గం మాజీ ఎమ్మెల్యే కుర్రా సత్యనారాయణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 25 లక్షల విరాళం ప్రకటించారు. ఈమేరకు ఆయన ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి చెక్కును అందజేశారు. నర్సాపూర్ నియోజక వర్గానికి చెందిన మాసాయిపేట గ్రామ ప్రజలు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 2లక్షల విరాళం ప్రకటించారు. దీనికి సంబంధించిన చెక్కును నర్సాపూర్ ఎమ్మెల్యే చినుముల మదన్‌రెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు, మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# కరోనా కట్టడిలో వైద్యారోగ్యశాఖ తీరు భేష్

## ప్రభుత్వాసుపత్రులపై ప్రజలకు భరోసా పెరిగింది
## -కలెక్టర్లతో సమిక్షలో విద్యుత్ శాఖామంత్రి జగదీష్ రెడ్డి

నల్లగొండ,జూలై21(ఆర్ఎన్ఎ): కరోనా కట్టడిలో ఉమ్మడి నల్గొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పనితీరు భేషుగ్గా ఉందని విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. సరిహద్దుల్లో సైనికుల్లా పనిచేస్తున్న వైద్య సిబ్బంది పనితీరుతో దవాఖానలపై ప్రజల్లో విశ్వసనీయత పెరిగిందని ఆయన అభిప్రాయపడ్డారు. కొవిడ్-19పై ఆయన సోమవారం సాయంత్రం ఉమ్మడి నల్గొండ జిల్లాల కలెక్టర్లు ప్రశాంత్ జీవన్ పాటిల్,వినయ్ కృష్ణారెడ్డి, అనితా రామచంద్రన్‌లతో పాటు నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల వైద్య ఆరోగ్యశాఖాదికారులు, నల్గొండ, సూర్యా పేట మెడికల్ కళాశాల ప్రిన్సి పాల్స్, వైద్యాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవగాహన లేక అక్కడక్కడా జరుగుతున్న అంశాలపై అపశృతులు దొర్లుతున్నట్లు ప్రచారం జరుగుతుందన్నారు. నిజానిజాలు ఏమిటో ప్రభుత్వానికి స్పష్టంగా తెలుసు అన్నారు. ప్రాణాలకు తెగించి ప్రాణాంతక వ్యాధి నుంచి సామాన్య పేద ప్రజలను కాపాడే వైద్య ఆరోగ్య సిబ్బంది మనోధైర్యం కోల్పోవద్దన్నారు. సమాచార లేమితో పుకార్లు షికార్లు చేస్తున్నాయని ప్రభుత్వం అన్నీ గమనిస్తోందని ఆయన చెప్పారు. అయితే అదే సమయంలో 24 గంటలు పని చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది అసహనానికి లోను కావొద్దన్నారు.

కరోనాను అరికట్టడంలో మన రాష్ట్రం ముందుందని మంత్రి తెలిపారు. ఇంతటి విపత్కర పరిస్థితుల్లో సామాన్య పేద ప్రజానీకం ప్రభుత్వ వైద్య శాలలకు తరలి రావడమే ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతోంద న్నారు. కొవిడ్ రోగుల్లోనూ మనోధైర్యాన్ని పెంపొందించేందుకు సిబ్బంది పడుతున్న శ్రమ అద్భుతమైన ఫలితాలు ఇస్తుందన్నారు. ఇకపై డివిజన్ కేంద్రాల్లో ఉన్న ఏరియా దవాఖానల్లోనూ కొవిడ్ టెస్ట్‌లు ఉంటాయని మంత్రి వెల్లడించారు. నల్గొండ, సూర్యాపేట దవాఖానల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తో వైద్యం అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

# సింగరేణి కార్మికులకు కొత్తగా క్వార్టర్లు

## రూ.210 కోట్లతో నిర్మాణానికి బోర్డు ఆమోదం
## సిఎం కెసిఆర్ హామీ మేరకు బోర్డు నిర్ణయం
## సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ వెల్లడి

హైదరాబాద్,జూలై21(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ హామీ మేరకు రూ.210 కోట్లతో కొత్త క్వార్టర్ల నిర్మాణానికి సింగరేణి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశం అంగీకారం తెలిపింది. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సోమవారం జరిగిన 554వ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకొన్నామని ఆ సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ వెల్లడించారు. సింగరేణి ప్రాంతాల్లో క్వార్టర్లు నిర్మించి కార్మికులకు అందుబాటులోకి తేవాలని గతంలో శ్రీరాంపూర్ ప్రాంతీయ ఆత్మీయ సమ్మేళనంలో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు.

ఈ మేరకు సత్తుపల్లిలో ఇప్పటికే తొలిదశ క్వార్టర్ల నిర్మాణం చేపట్టామని, ఇప్పుడు భూపాలపల్లిలో విశాలమైన సౌకర్యవంతమైన 994 ఎండీ టైపు క్వార్టర్లు నిర్మించడానికి నిర్ణయించామని దీనికి బోర్డు ఆమోదం లభించిందన్నారు. పర్యావరణ పరిరక్షణ చర్యలను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు నిపుణులతో ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయడానికి బోర్డు అంగీకారం తెలిపిందన్నారు. త్వరలో పూర్తిస్థాయి సింగరేణి పర్యావరణశాఖ ఏర్పాటవుతుందని తెలిపారు. ఇల్లందు ఏరియా కోయగూడెం ఓసీ-2లో సర్ఫేస్ మైనర్ ద్వారా 74 లక్షల క్యూబిక్ మీటర్ల బొగ్గు తవ్వకానికి, మణుగూరు పీకేఓసీ నుండి రానున్న 6 ఏళ్లలో 1,416 లక్షల బ్యాంక్ క్యూబిక్ మీటర్ల ఓబీ తవ్వకానికి బోర్డు ఆమోదం తెలిపింది. సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో ఓబీ తవ్వకం కోసం వినియోగించే మందుగుండు సామగ్రి కొనుగోలుకు రూ.106 కోట్లు, భూగర్భ గనుల్లో వాడే మందుగుండు సామగ్రి కొనుగోలుకు రూ.41 కోట్లను కేటాయించింది. సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాలిటెక్నికల్ కళాశాల, మహిళా, జూనియర్, డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేట్ కళాశాలలు, 9 హైస్కూల్స్ నిర్వహణకు 2020-21 ఆర్థిక సంవత్సరానికి రూ. 45 కోట్ల బడ్జెటును బోర్డు మంజూరు చేసింది. బోర్డు సభ్యులుగా ఉండి ఈ నెలాఖరుకు ఉద్యోగ విరమణ చేయనున్న రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్‌మిశ్రా, సింగరేణి డైరెక్టర్లు ఎస్.శంకర్ , బి.భాస్కరరావు సేవలను సంస్థ ఛైర్మన్ ప్రశంసించి ఘనంగా సన్మానించారు.

# కరోనా నివారణకు సిఎం జగన్ కీలక నిర్ణయాలు

## రాష్ట్రస్థాయిలో కోవిడ్ ఆస్పత్రుల సంఖ్య 10కి పెంపు
## పూర్తిస్థాయి సేవలు అందించడంపై దృష్టి పెట్టాలని ఆదేశాలు

అమరావతి,జూలై21(ఆర్ఎన్ఎ): రాష్ట్రస్థాయిలో ఉన్న కోవిడ్ ఆస్పత్రుల సంఖ్యను 5 నుంచి 10కి పెంచాలని సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. వైద్యులపై పని భారం లేకుండా నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. జిల్లాల్లో ఉన్న 84 కోవిడ్ ఆస్పత్రుల్లో నాణ్యమైన సేవలపైనా ప్రత్యేక దృష్టి సాధించాలని ఆదేశించారు. ఈ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం రాయితీలు అందించాలన్నారు. కరోనా నివారణ చర్యలపై వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ సీఎం ఆళ్ల నాని, సీఎస్ నీలం సాహ్ని, డీజీపీ గౌతమ్ సవాంగ్, హెల్త్ స్పెషల్ సీఎస్ జవహర్ రెడ్డి, టాస్క్ ఫోర్స్ ఛైర్మన్ కృష్ణబాబు పాల్గొన్నారు. ఆయా ఆస్పత్రుల్లో ఏం చేయాలనే దానిపై రెండు రోజుల్లో నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. రాష్ట్రస్థాయి కోవిడ్ ఆస్పత్రుల మాదిరిగా ఈ ఆస్పత్రులు కూడా పూర్తిస్థాయి సేవలు అందించడంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రస్తుతం ఉన్న 5 రాష్ట్రస్థాయి ఆస్పత్రుల్లోనూ నాణ్యమైన సేవలకోసం సత్వర చర్యలు చేపట్టాలని.. వీలైనంత త్వరగా వైద్యులు, సిబ్బంది నియామకం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కోవిడ్ సోకిందన్న అనుమానం వస్తే ఏంచేయాలి? ఎవర్ని కలవాలన్న దానిపై అవగాహనకు భారీ ప్రచారం నిర్వహించాలన్నారు. కోవిడ్ ఎవరికైనా వస్తుంది, ఆందోళన వద్దు. 85 శాతం మందికి ఇళ్లల్లోనే ఉంటూ నయం అవుతుంది. జాగ్రత్తలు పాటిస్తూ సకాలంలో వైద్యం తీసుకోవాలి. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవాళ్లు, వయసులో పెద్దవాళ్లు వైద్య సహాయంలో ఆలస్యం వద్దు. క్షేత్రస్థాయిలో ఈ సమాచారాన్ని తెలియజేస్తూ హోర్డింగ్స్ పెట్టాలి. గ్రామ సచివాలయాల్లో కూడా ఈ హోర్డింగ్స్ ఉండాలి. క్వారంటైన్ సెంటర్ల సంఖ్య కన్నా క్వాలిటీ మీద దృష్టి పెట్టాలి. కోవిడ్ ఉందా? లేదా? అన్నది తెలుసుకోవడానికి ర్యాపిడ్ టెస్టులు అందుబాటులోకి వచ్చినందున ఎవరిని ఎక్కడ పెట్టాలన్న దానిపై స్పష్టత వస్తుందని, ఆ తర్వాత వారికి మంచి సేవలు అందించాలని సూచించారు. అలాగే కాల్ సెంటర్ ద్వారా వస్తున్న ఫిర్యాదులు, వినతుల మీద ప్రత్యేక దృష్టి వహించాలన్నారు. టెలి మెడిసిన్‌పై ఎప్పటికప్పుడు రివ్యూ చేయాలి. మందులు ఇంటికి సరఫరా చేస్తున్నారా? లేదా? మరోసారి పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. వైద్య రంగంలో చేపట్టనున్న నాడు?నేడు కార్యక్రమాలపై ఫోకస్ పెంచాలన్నారు. వచ్చే మూడు, నాలుగు నెలలపాటు నిర్దేశిరచుకున్న కార్యాచరణను పటిష్టంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఇవన్నీ పూర్తయితేనే కోవిడ్‌లాంటి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోగలమని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు.

### 24 గంటల్లో 4,074 పాజిటివ్ కేసులు

ఇదిలావుంటే ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన 24 గంటల్లో 33,580 కరోనా నిర్ధారణ పరీక్షలు చేయగా 4,074 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలో పాజిటివ్ కేసుల మొత్తం సంఖ్య 53,724 కు చేరింది. తాజా పరీక్షల్లో 17,385 పరీక్షలు ట్రూనాట్ పద్ధతిలో చేయగా.. 16,195 పరీక్షలు ర్యాపిట్ టెస్టింగ్ పద్ధతిలో చేశారు. రాష్ట్రంలో కొత్తగా 1335 మంది వైరస్ బాధితులు కోలుకున్నారు. దీంతో కోలుకున్నవారి మొత్తం సంఖ్య 24,228 కి చేరింది. రాష్ట్రంలో కొత్తగా 54 మరణాలు సంభవించాయి. దీంతో మొత్తం మృతుల సంఖ్య 696 కు చేరింది. 28,800 యాక్టివ్ కేసులున్నాయి. నేటివరకు రాష్ట్రంలో 13,49,112 నమూనాలను పరీక్షించారు. ఈమేరకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ఆదివారం హెల్త్ బులెటిన్‌లో పేర్కొంది.

22న వనమహోత్సవంలో పాల్గొననున్న జగన్

ఈ నెల 22న జూపూడిలో జరిగే వనమహోత్సవనకు సీఎం జగన్ హాజరవుతున్న సందర్భంగా ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రవిచంద్ర తెలిపారు. విశాఖపట్నం నుంచి నగరానికి వచ్చు వాహనాలను హనుమాన్ జంక్షన్ వద్ద నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అలాగే హైదరాబాద్ నుంచి వచ్చు వాహనాలను నందిగామలో నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. గుంటూరు నుంచి వచ్చు వాహనాలను గుంటూరు లోనే నిలిపివేయనున్నట్లు తెలిపారు.

# నెలాఖరుకల్లా బిసి కార్పోరేషన్లకు డైరెక్టర్లు

## బిసిల అభివృద్దికి ఫోకస్‌గా ఉన్నాం
## సమిక్షలో సిఎం వైఎస్ జగన్

అమరావతి,జూలై21(ఆర్ఎన్ఎ): ఈ నెలాఖరు కల్లా బీసీ కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్ల పోస్టుల భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. బీసీ పరిధిలోని వివిధ ఉప కులాల కార్పొరేషన్ల ఏర్పాటుపై ఆయన సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ సీఎం పిల్లి సుభాష్ చంద్రబోస్, మంత్రులు శంకర నారాయణ, బొత్స సత్యనారాయణ, ధర్మాన కృష్ణదాస్, మోపిదేవి, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి హాజరయ్యారు. బీసీల్లోని ఆయా కులాల వారికి ప్రభుత్వ ప్రయోజనాలు అందుతున్నాయా? లేదా? అన్న విషయాన్ని కార్పొరేషన్లు పర్యవేక్షించాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు.

అందరికీ పథకాలు అందే విధంగా ప్రధాన బాధ్యతగా నడుచుకోవాలని సీఎం సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ 2,12,40,810 మంది బీసీలకు రూ. 22,685.74 కోట్ల రూపాయలను నగదు బదిలీ ద్వారా అందించామని సీఎం పేర్కొన్నారు. బీసీల అభ్యున్నతి కోసం ఇంత ఫోకస్‌గా గతంలో ఎవరూ, ఎప్పుడూ పని చేయలేదని సీఎం స్పష్టం చేశారు. రూపాయి లంచం, వివక్ష లేకుండా తలుపుతట్టి మరీ పథకాలు అందిస్తున్నామన్నారు. కొత్త వాటితో కలుపుకుని మొత్తంగా 52 కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తున్నాం. గతంలో 69 కులాలకే ప్రాధాన్యత ఇచ్చారని, ఇప్పుడు మొత్తం బీసీ కులాలన్నింటికీ కార్పొరేషన్లలో ప్రాధాన్యత ఇస్తున్నామని సీఎం వైఎస్ జగన్ తెలిపారు.

# కరోనా కట్టడికి అన్ని చర్యలు

## -మంత్రి పువ్వాడ అజయ్ వెల్లడి

ఖమ్మం,జూలై21(ఆర్ఎన్ఎ): కరోనా కట్టడికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి గ్రామంలో గల గిరిజన యువత శిక్షణా కేంద్రం లో ఏర్పాటు చేసిన కొవిడ్ కేర్ సెంటర్ ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కరోనా విషయంలో ఎవరు భయాందోళనకు గురికావాల్సిన పనిలేదన్నారు. ప్రభుత్వ దవాఖాన కాకుండా అదనంగా ఇక్కడ 70, మమత దవాఖానలో 130 బెడ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. శారద ఇంజినీరింగ్ కళాశాలలో కూడా కొవిడ్ హెల్త్ కేర్ ఏర్పాటు చేస్తామన్నారు. అసత్య ప్రచారాలు నమ్మవద్దని, తెలంగాణలో కరోనా బారిన పడి నయం అయిన వారి సంఖ్య 98.5 శాతం ఉండగా, మరణాలు 1.5 శాతం మాత్రమే అని వెల్లడించారు. కరోనా పై పోరాడుతున్న వైద్య, పారిశుధ్య సిబ్బందికి ఆత్మస్థైర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి , ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ ,జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ డీఎం హెచ్ వో మాలతి తదితరులు ఉన్నారు.

# రక్తపరీక్షతో 20 నిముషాల్లోనే కరోనా గుర్తింపు

## -ఆస్ట్రేలియా శాస్త్రవేత్తల సరికొత్త ఆవిష్కరణ

న్యూఢిల్లీ,జూలై21(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి ప్రపంచదేశాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. ప్రపంచ వ్యాప్తంగా పాజిటివ్ కేసుల సంఖ్య 1.40 కోట్లు దాటింది. ఆరు లక్షల మందికిపైగా కరోనా బాధితులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో పలు దేశాలు కరోనాకు వ్యాక్సిన్‌ను తయారు చేస్తున్నాయి. వాటిలో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన జెన్నర్ ఇన్‌స్టిట్యూట్ అభివృద్ధి చేస్తున్న టీకా ముందంజలో ఉన్నది. అదేవిధంగా కరోనా నిర్ధారణ పరీక్షలకు సంబంధించి కూడా పలు సంస్థలు కొత్తకొత్త ఆవిష్కరణలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆస్ట్రేలియాకు చెందిన మోనాష్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు కొత్తరకం రక్తపరీక్షను అభివృద్ధి చేశారు. ఈ కొత్త పరీక్ష ద్వారా ఒక వ్యక్తికి కరోనా సోకిందా లేదా అనే విషయాన్ని కేవలం 20 నిమిషాల్లోనే తెలుసుకోవచ్చు. అంతేగాక ఈ కొత్తరకం పరీక్ష ద్వారా కరోనా సోకినవారినే కాకుండా కరోనా బారినపడి కోలుకున్నవారిని సైతం గుర్తించవచ్చని మోనాష్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు తెలిపారు. అదేవిధంగా వ్యాక్సిన్ పరీక్షల్లో అవసరమైన యాంటీబాడీల వృద్ధిని కూడా కరోనా పరీక్షల ద్వారా త్వరగా తెలుసుకోవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. ఇటీవల తమ పరిశోధకులు 25 మైక్రోలీటర్ల ప్లాస్మాను ఉపయోగించి కరోనా కేసులను గుర్తించినట్లు మోనాష్ యూనివర్సిటీ ఒక ప్రకటనలో తెలిపింది. కరోనా పాజిటివ్ కేసులు ఎర్ర రక్తకణాల క్లస్టరింగ్‌కు కారణమవుతాయని, ఇకపై దాన్ని కంటితో సులభంగా గుర్తించవచ్చని యూనివర్సిటీ పేర్కొన్నది. ఈ పరీక్షను ఉపయోగించి పరిశీలకులు కేవలం 20 నిమిషాల్లోనే పాజిటివ్, నెగెటివ్ రీడింగ్స్ పొందవచ్చని యూనివర్సిటీ వెల్లడించింది.

## కరీంనగర్ కమిషనరేట్ పోలీసులను ఆదర్శంగా తీసుకుని
# రాష్ట్రవ్యాప్తంగా యాదాద్రి ఫారెస్ట్ మోడల్‌ను అమలుచేస్తున్నాము
## రాష్ట్ర ఐటి,మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పరిశ్రమలశాఖ మంత్రి కె తారకరామారావు



కరంనగర్, జులై 21 (నేటినిజం ప్రతినిధి):కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు మొక్కల పెంపకంలో చూపుతున్న శ్రద్దాసక్తులు, అంకితభావంతో చిట్టడవుల పెంపకం, గతంలో జరిగిన హరితహారంలో నాటిన మొక్కలు నేడు వృక్షాలుగా ఎదుగడాన్ని ఆదర్శంగా తీసుకుని ఇదే పద్దతిలో చిట్టడవులు పెంపకాన్ని యాదాద్రి ఫారెస్ట్ మోడల్‌గా నామకరణంచేసి రాష్ట్రవ్యాప్తంగా అమలుచేస్తున్నామని రాష్ట్ర ఐటి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పరిశ్రమలశాఖ మంత్రి కె తారకరామారావు అన్నారు. కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో పెంచబడుతున్న చిట్టడవులు, హరితహారంలో మొక్కల సంరక్షణపై వివిధ మిడియాల్లో ప్రచురితం, ప్రసారం అయిన వార్తలను చుదువడం, చూడటం జరిగిందని, నేడు స్వయంగా పరిశీలించి ఆశ్చర్యపోయానని చెప్పారు.

మంగళవారం నాడు కరీంనగర్‌కు విచ్చేసిన రాష్ట్ర ఐటి,మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పరిశ్రమలశాఖ మంత్రి కె తారకరామారావు ఇందులో భాగంగా సిటిపోలీస్ శిక్షణ కేంద్రం(సిపిటిసి)లో మియావాకి పద్దతిలో పెంచబడుతున్న చిట్టడవులు, గతంలో జరిగిన హరితహారం కార్యక్రమాల సందర్భంగా నాటిన మొక్కలు నేడు వృక్షాలుగా మారిన తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కల పెంపకంలో కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు శ్రద్ద, అంకితభావానికి వనాలను తలపిస్తున్న మొక్కల పెంపకం నిదర్శనమన్నారు. పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి పట్టుదల,కృషి,ప్రత్యక్ష్య పరిశీలన ద్వారానే ఇది సాధ్యమైందని అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటోఎగ్జిబిషన్‌లో మొక్కలు పెంచడానికి అనువుగా లేని భూమిని మొక్కల పెంపకానికి అనువుగా మార్చడానికి తీసుకున్న చర్యలు చిట్టడవుల పెంపకానికి తాము ప్రేరేపితులుకావడం, చిట్టవుల పెంపకంలో భాగంగా మొక్కలునాటిననాటి నుండి ఇప్పటి వరకు తీసుకుంటున్న చర్యలను కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి రాష్ట్ర మంత్రి కెటిఆర్‌కు వివరించారు. తాము ఇంటర్నెట్‌లో చదివిన విషయాలు, ఇతర రకాల పుస్తకాల అధ్యయనం, అటవీశాఖ అధికారులు, ఇతర విభాగాలకు చెందిన అందించిన సహకారంతో సఫలీకృతమయమన్నారు. చిట్టడవుల పెంపకంతోపాటు, వివిధ రకాల మొక్కలు నాటడం, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కమిషనర్‌ను అడిగితెలుసుకున్నారు. ఒక ఎకరం విస్తీర్ణంలో పెంచబడుతున్న చిట్టడవులు, వాటికి నీరందించే పద్దతులను పోలీస్ కమిషనర్ కమలాసన్‌రెడ్డి ప్రత్యక్షంగా పరిశీలింపజేశారు. మియావాకి ప్రాజెక్ట్-2లో పెంచబడుతున్న మొక్కల తీరును వివరించారు.

**మరోసారి క్షుణ్ణంగా పరిశీలించేందు వస్తా**

కరీంనగర్ కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో పెంచబడుతున్న చిట్టడవులు, హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలకు ప్రత్యేకంగా పరిశీలించేందుకు మళ్ళీవస్తానని మంత్రి కె తారకరామారావు అన్నారు. ప్రస్తుత పర్యటనలో తక్కువ సమయం మాత్రమే లభించిందని చెప్పారు.ఈ సందర్భంగా మంత్రి కె తారకరామారావు, పౌరసరఫరాలశాఖమంత్రి గంగుల కమలాకర్, శాసనసభ్యులు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు తదితరులు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి ఛైర్‌పర్సన్ విజయ, నగరమేయర్ వై సునీల్‌రావు, సుడా ఛైర్మెన్ రామకృష్ణారావు, స్థానిక కార్పోరేటర్ ఐలేందర్‌యాదవ్, జిల్లా కలెక్టర్ కె శశాంక, మున్సిపల్ కమిషనర్ క్రాంతి, సిపిటిసి ప్రిన్సిపల్, అడిషనల్ డిసిపి(ఎల్అండ్ఓ) ఎస్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ శివభాస్కర్, ఎస్‌బిఐ ఇంద్రసేనారెడ్డి, సిపిటిసి ఇండోర్ అవుట్‌డోర్ విభాగాలకు చెందిన అధికారులు నాగేందర్, నాగేశ్వరరావు, కిరణ్‌కుమార్, పలువురు పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మ నిర్భర్ భారత్ ప్యాకేజ్ - సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల పై ప్రభావం' అంశం పై వెబినార్

హైదరాబాద్, జులై 21:కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన రీజనల్ అవుట్ రీచ్ బ్యూరో (ఆర్ఒబి) ఈ రోజు 'ఆత్మ నిర్భర్ భారత్ ప్యాకేజ్ - సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పై ప్రభావం' అనే అంశం పై వెబినార్ నిర్వహించింది. ఈ వెబినార్ లో హైదరాబాద్ లోని కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (నితి-ఓఇ) జాతీయ సంస్థ ప్రోగ్రామ్ డైరెక్టర్ శ్రీ జి. సుదర్శన్ ప్రధాన వక్తగా పాల్గొన్నారు. తక్కువ పెట్టుబడితో స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి ఆయన వివరించారు. ఇటీవల ఆత్మ నిర్భర్ భారత్ ప్యాకేజీలో భాగంగా కేంద్ర ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల కోసం ప్రకటించిన క్రెడిట్ గ్యారంటీ స్కీమ్ గురించి వివరించారు. ఎంఎస్ఎంఇ రంగంలో పరిశ్రమలు నెలకొల్పేవారికి ప్రభుత్వం ద్వారా 3 లక్షల కోట్ల విలువైన క్రెడిట్ గ్యారంటీ సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించిందని శ్రీ సుదర్శన్ తెలిపారు. ఇంకా, ప్రధాన మంత్రి ముద్ర యోజన, ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ.. మొదలైన పథకాల గురించి కూడా వివరించారు.

# వ్యాధులు ప్రబలకుండా జిల్లాలో చర్యలు

జగిత్యాల,జూలై21(ఆర్ఎన్ఎ): వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా జిల్లాలో చర్యలు చేపట్టామని జిల్లా వైద్యధికారి పేర్కొన్నారు. ముందస్తు చర్యలు తీసుకుని వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశామని అన్నారు. గ్రామాల్లో ప్రజలు పారిశుద్యం పాటిస్తేనే వ్యాధులకు దూరంగా ఉండగలరని అన్నారు.అంటు వ్యాధులు, జ్వరాలు ప్రబలినప్పుడు ప్రత్యేకంగా రాఫిడ్ యాక్షన్ టీమ్‌లను ఏర్పాటు చేసుకొని వైద్యులు, పారామెడికల్ సిబ్బంది సేవలు వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు. పంచాయితీ రాజ్ , ఐసీడీఎస్, మెడికల్ అండ్ హెల్త్ శాఖల అధికార సమన్వయంతో పని చేస్తూ సీజనల్ వ్యాధులు సోకకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో 80 శాతం ప్రసవాలు జరిగేలా సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు కృషి చేయాలన్నారు. గర్భిణీలు, ప్రసవాలకు ఆసుపత్రికి వచ్చే మహిళలకు 102 వాహన సేవలు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.

# ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలేవీ?

## కరోనా దందాపై ఉదాసీనత
## ప్రజల్లో ఆందోళనను పట్టించుకోని ప్రభుత్వం

హైదరాబాద్,జూలై 21(ఆర్ఎన్ఎ): కరోనాపై తీవ్ర ఆరోపణలు ఉన్నా ఇప్టి వరకు ఒక్క ప్రైవేట్ ఆస్పత్రి మీద కూడా ఇంత వరకు కేసు పెట్టలేదు. స్పెయిన్ వంటి దేశాల్లో, ప్రైవేటు ఆస్పత్రులనన్నిటినీ ప్రభుత్వాలు తాత్కాలికంగా స్వాధీనం చేసుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఈ విషయంలో మెరుగుగా ఉన్నది. ప్రైవేటు వైద్యసంస్థలను ఎంతో కొంత అదుపు చేస్తున్నది. అత్యవసర సమయంలో వచ్చిన పేషెంటును తిరస్కరించడానికి వీలులేదు. వైద్యుల ప్రవర్తనా నియమావళి కూడా అందుకు అంగీకరించదు. ఆ అస్పత్రి లో పడకలు లభ్యం కాకున్నా, అత్యవసర విభాగంలో తాత్కాలిక చికిత్స చేసి, పడకలు అందుబాటులో ఉన్న ఆస్పత్రికి పేషెంటును పంపాలి. ప్రైవేటు ఆస్పత్రుల మీద భ్రమతో, ప్రాణభయంతో వెడుతున్న పేషెంట్లకు తగిన ఆశ్వాసన ఇచ్చే వ్యవస్థ ఉండాలి. అత్యవసర సమయాల్లో వ్యవహరించ వలసిన తీరు గురించి ప్రచారం ముమ్మరంగా జరగాలి. చికిత్సకు లక్షలాది రూపాయల బిల్లు ఎందుకు అవుతుందో అడిగేవారు లేరు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఒక్కో రోగికి అవుతున్న ఖర్చును ప్రాతిపదికగా తీసుకుని ఫీజులు నిర్ణయించి, కఠినంగా అమలు చేయవలసిన ప్రభుత్వం చేతులు ముడుచుకు కూర్చున్నది. కొన్ని ముఖ్య నగరాల్లో సరే, జిల్లా కేంద్రాలలోని ఆస్పత్రులలో పరిస్థితీ ఆశాజనకంగా లేదు. ఉభయ రాష్ట్రాల్లో ఈ అంశాల్లో అలక్ష్యమే కనిపిస్తున్నది. కరోనా నిరోధానికి ముఖానికి ముసుగులు ధరించడం తప్పనిసరి అని ఆంధప్రదేశ్ ప్రభుత్వం ఆలస్యంగానైనా నిబంధన విధించి, అమలుచేస్తున్నది. తెలంగాణ ప్రభుత్వం ముసుగులు ధరించనివారికి వెయ్యి జరిమానా అని ఎప్పుడో ప్రకటించినా, ఆచరణ మాత్రం శూన్యం. ఎటువంటి కట్టడులూ లేవు. బహిరంగ ప్రదేశాల్లో అయినా భౌతికదూరాన్ని పాటింపజేయడానికి ఎటువంటి యంత్రాంగమూ లేదు. ఆంధ్రప్రదేశ్‌లో కరోనా విలయతాండవం చేస్తున్నది. ఒకేరోజు నాలుగు వేల కేసులు రావడం, 50 మందికి పైగా చనిపోవడం ఆనవాయితీగా మారేట్టు కనిపిస్తున్నది. తెలంగాణలోనూ భీతావహ పరిస్థితి కొనసాగుతూనే ఉన్నది. ఆదిలో ఎంతో ఆదర్శంగా కనిపించిన తెలంగాణ ప్రభుత్వం, లాక్‌డౌన్ సడలించే సమయం వచ్చే నాటికి, చేతులెత్తేసినట్టు కనిపించసాగింది. తగినన్ని పరీక్షలు చేయకపోవడం, పరీక్షా కేంద్రాలను పెంచకపోవడం, ప్రైవేటు చికిత్సను అనుమతించకపోవడం మొదట సమస్యలుగా ఉండేవి. తమకు వ్యాధి సోకిందేమోనన్న అనుమానం ఉన్నవారికి వెంటనే స్పందన దొరకకపోవడం, వ్యాధి నిర్ధారణ కానివారికి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రవేశం ఇవ్వకపోవడం, ప్రైవేటులో అందుకు ఆస్కారం లేకపోవడం వల్ల ప్రజలలో ఆందోళన ఉండేది. ఇప్పుడు, పరీక్షల సంఖ్య పెంచారు. పరీక్షాకేంద్రాల సంఖ్యను కూడా పెంచారు. ప్రైవేటు చికిత్సను అనుమతిస్తున్నారు. అయినా, పరిస్థితి మెరుగుపడలేదు. పరీక్షల సంఖ్యను పెంచేనాటికి, వ్యాప్తి విపరీతంగా పెరిగిపోయింది. ఇప్పటికీ రోజువారీగా జరుపుతున్న 15వేల పై చిలుకు పరీక్షలు, వాస్తవ స్థితిని ప్రతిబింబిస్తున్నాయా అన్నది అనుమానమే. మరణాల నివారణలో ప్రభుత్వాలు క్రియాశీలంగా చేస్తున్న కృషి ఏమీ కనిపించడం లేదు. ప్రభుత్వాలు పరిస్థితిని గాలికి వదిలేసి కూర్చోక పోతే, ప్రజలలో విశ్వాసాన్ని కల్పించడం సాధ్యమే. పారదర్శకమైన సమాచారం, ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను యుద్ధ ప్రాతిపదిక మీద మెరుగుపరచడం, ప్రైవేటు ఆస్పత్రుల మీద ప్రభుత్వ నియంత్రణ వంటి చర్యలు తీసుకొనగలిగితే, వాతావరణంలో ఇంత భయాందోళనలు, విషాదం నెలకొనేవి కావు.

# బోనాల ఉత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు : మంత్రి అల్లోల

హైదరాబాద్, జులై 21: బోనాల ఉత్సవాలు నిరాడంబరంగా జరిగేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తల్లుల ఆశీర్వాదంతో ఈ బోనాలు ప్రశాంతంగా విజయవంత మయ్యాయని, సహకరించిన భక్తులు, అధికారులు, సిబ్బంది అందరికీ మంత్రి మంగళవారం ఒక ప్రకటనలో ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు.

కరోనా నుంచి త్వరగా బయటపడేలా చూడాలని, ప్రజలందరిపై విూ ఆశీర్వాదం ఉండేలా చూడాలని అమ్మ వారిని ప్రార్థించారు. బోనాల వేడుకలను ప్రతిసారి అంగరంగ వైభవంగా నిర్వహి ంచేవారమని కరోనా నేపథ్యంలో బోనాలు సందడి లేకుండానే జరిగాయన్నారు. ఆలయ పూజారులు, సిబ్బంది మాత్రమే అమ్మవార్లకు బోనం సమర్పించి, పూజలు నిర్వహించారని వెల్లడించారు. భక్తులు కూడా ఇండ్లలోనే బోనం సమర్పించి పూర్తిగా సహ కరించారన్నారు.

# వ్యవసాయంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం



నల్లగొండ,జులై 21: అప్పు చేయకుండా రైతులు వ్యవసాయం చేసేలా ముఖ్యమంత్రి కేసీఆర్ విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకొచ్చారని, విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. జిల్లాలోని మునుగోడు నియోజకవర్గంలోని అన్ని మర్రిగూడెం, నాంపల్లి, చండూర్, మునుగోడు మండల కేంద్రాల్లో రైతువేదిక భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన విధంగా సాగులో సమూల మార్పులు తీసుకువచ్చి వ్యవసాయాన్ని పండగలా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ దేనని జగదీష్ రెడ్డి అన్నారు.

రైతులకు పుష్కలంగా నీళ్లు, 24 గంటల ఉచిత కరంట్, ఎకరానికి 10 వేల రూపాయల పెట్టుబడి సాయం అందిస్తూనే.. గిట్టుబాటు ధర కూడా రైతులకు అందిస్తూ కేసీఆర్ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. రైతులకు బహుళ ప్రయోజనాలు కల్పించే రైతు వేదికల నిర్మాణాలు ఉమ్మడి నల్గొండ జిల్లాలో దసరా లోపు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు.

గత పాలకులు వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసారని, సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలతో తెలంగాణ లో నేడు వ్యవసాయం పండుగలా మారిందని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో మునుగోడు మాజీ ఎమ్మెల్యే కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రాంచంద్రనాయక్, టీఆర్ఎస్ నాయకులు కర్నాటి విద్యాసాగర్, నారాబోయిన రవి స్వరూప, స్థానిక ఎంపీపీలు, జడ్పిటిసీ సభ్యులు, సర్పంచ్ లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# ఇరాన్,చైనా కొత్తబంధంతో ఇండియాకు ఇరకాటం

## అంతర్జాతీయంగా వ్యూహాలు మార్చాల్సిన సమయం

న్యూఢిల్లీ,జూలై21(ఆర్ఎన్ఎ): చైనా కుట్రలు ఆగడం లేదు. ఓ వైపు పాక్‌ను, నేపాల్‌ను రెచ్చగొట్టిన డ్రాగన్ కంట్రీ తాజాగా ఇరాన్‌ను బుట్టలో వేసుకుంది. భారత్ అమెరికాకు దగ్గర కావడంతో , అమెరికా వ్యతిరేకి ఇరాన్‌ను చైనాను దగ్గరకు తీయడం అంతర్జాతీయంగా డ్రాగన్ ఆడుతున్న నాటకానికి నిదర్శనంగా చూడాలి.

ఇరాన్ చైనాల మధ్య నాలుగువందల బిలియన్ డాలర్ల ఒప్పందం గుట్టుచప్పుడు కాకుండా కుదిరిన తరువాత, చాబహార్ రైలు ప్రాజెక్టునుంచి భారత్‌ను ఇరాన్ పక్కకు తప్పించింది. ఈ దశలో మనదేశం కూడా వ్యూహాలు మార్చాల్సి ఉంది. మన ఎత్తుగడలు మనకు ఉండాలి. అంతర్జాతీయంగా చైనా కుట్రలకు చెక్ పెట్టాలి. నాలుగేళ్ళయినా అడుగు ముందుకు వేయని ఈ ప్రాజెక్టను ఇక మేమే నిర్మించుకుంటామని ఇరాన్ ప్రకటించింది. అమెరికా ఆంక్షలు, హెచ్చరికలను కాలదన్ని కుదుర్చుకున్న ఈ ఒప్పందం మేరకు సర్వ వ్యవస్థల్లోనూ, సకలవిధాలుగానూ ఇరాన్‌కు చైనా సహకరించబోతున్నది.

ఇరాన్ చమురు పాతికేళ్ళపాటు కారుచవుకగా పొందబోతున్న చైనా, అందుకు ప్రతిఫలంగా దాని చమురు, సహజవాయువు క్షేత్రాల్లోనూ, రవాణా వ్యవస్థల నిర్మాణంలోనూ భారీ పెట్టుబడులు పెడుతుంది. బ్యాంకింగ్, టెలీకమ్యూనికేషన్స్, పోర్టులు, రైల్వేలతో పాటు ఇరాన్ చేపట్టబోయే ప్రతీ భారీ ప్రాజెక్టులోనూ చైనా చేయూత ఉంటుంది. రెండు దేశాలూ సంయుక్త సైనిక విన్యాసాలు నిర్వహిస్తాయి, ఆయుధాలు తయారుచేస్తాయి, నిఘాసమాచారాన్ని పంచుకుంటాయి. ఈ ఒప్పందంతో ఇకపై నీకు నేను, నాకు నువ్వు అన్న స్థాయిలో రెండు దేశాల మధ్యా దీర్ఘకాలిక, వ్యూహాత్మక బంధం ఏర్పడింది. ఏమైతేనేమి, మనకు ఎంతో సన్నిహితంగా ఉన్న ఇరాన్‌కు అమెరికా కారణంగా దూరం జరుగుతున్న స్థితిలో చైనా ప్రవేశించింది.

అమెరికా తన ఆప్త దేశాలకు కట్టబెట్టే గౌరవాలు, హోదాలతో పోల్చితే ఇది ఓ మెట్టుపైనే ఉందని నిపుణుల అంచనా. చైనాకు ఇంత సన్నిహితంగా జరిగిన తరువాత భారత్ విషయంలో ఇరాన్ ఈ నిర్ణయం తీసుకోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఫర్జాద్ చమురు క్షేత్రం అభివృద్ధి పనులనుంచి ఓఎన్‌జీసీ విదేశ్ (ఓవీఎల్)ను కూడా ఇరాన్ తప్పించబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. పాకిస్థాన్‌లో చైనా నిర్మిస్తున్న గ్వదార్ పోర్టుకు పోటీగా ఇరాన్‌లో భారత్ ప్రతిపాదించిన చాబహార్ వ్యూహాత్మకంగా, వాణిజ్యపరంగా కీలకమైంది. చీటికీ మాటికీ మోకాలడ్డే పాకిస్థాన్‌ను పక్కనబెట్టి, మధ్య ఆసియా, పశ్చిమాసియా, యూరప్ వరకూ వాణిజ్యాన్ని విస్తరించగలిగే తోవ ఇది. ఇరాన్‌తో ఒబామా కుదుర్చుకున్న అణు ఒప్పందంతో పోర్టు పనులు వేగవంతమై ఒక కొలిక్కివస్తున్న స్థితిలో, ఒప్పందంనుంచి ట్రంప్ ఏకపక్ష నిష్క్రమణతో, ఆంక్షలతో పలు అవాంతరాలు ఎదుర్కొంది. ట్రంప్‌కు నచ్చచెప్పుకొని, ఆంక్షలనుంచి చాబహార్‌కు మినహాయింపు సాధించి, విశాలమైన పోర్టులో ఒక టెర్మినల్‌ను దారికి తెచ్చుకోవడంతో సరిపోయింది. పదేళ్ళలీజులో ఇంతకు రెట్టింపు సదుపాయాలు సమకూర్చుకొని, రైల్వేలైను నిర్మాణంతో స్వేచ్ఛావాణిజ్య ప్రాంతాన్ని కూడా సమర్థంగా వినియోగించుకోగలిగే అవకాశం ఉండగా, ట్రంప్ వీరంగం అడుగు కదలకుండా చేశాయి. రైల్వేలైన్ నిర్మాణంతోనే పోర్టు గరిష్ట వినియోగం సాధ్యం. ఓ నాలుగువేల కోట్లతో దానిని పూర్తిచేయగలిగే అవకాశాన్ని భారత్ చేజేతులా కోల్పోయింది. అమెరికా మిత్రదేశంగా అవతరించి, పలు వ్యూహాత్మక ఒప్పందాలు కుదుర్చుకున్న భారత్‌మీద, ఇరాన్ చవుక చమురుతో పాటు, ఈ ప్రాజెక్టు విషయంలోనూ ఒత్తిళ్ళు పనిచేసి ఉండవచ్చు. రైల్వేలైను తానే నిర్మించుకుంటానన్న ఇరాన్ ప్రకటన వెనుక, భారత్ సాగదీతతో పాటు చైనా కొత్తగా ఇచ్చిన ధైర్యం బాగా పనిచేసింది. అమెరికా ఆంక్షల వల్ల విదేశీపెట్టుబడులు నిలిచిపోయి, తీవ్రంగా నష్టపోయిన ఇరాన్‌కు చైనా చేయూత లాభిస్తుంది. చైనా పెట్టుబడులు, సాంకేతికత సాయంతో అది నిలదొక్కుకోగలుగుతుంది. ఇరాన్ రక్షణ రంగం బలోపేతమై అమెరికాతో వచ్చే ప్రమాదం నుంచి కాపాడగలదు. చైనా అండతో అమెరికా, ఇజ్రాయెల్, సౌదీ అరేబియావంటి దేశాలను ఢీ కొట్టగలస్థాయికి ఇరాన్ చేరుకుంది. ఇరాన్ భాషలో చెప్పాలంటే, ఈ ఒప్పందంతో ఉభయదేశాలూ కలసికట్టుగా అణచివేతకు పాల్పడుతున్న శక్తులను ఓడించగలవు. ఒకపక్క చైనాతోనూ, మరోవైపు ఇరాన్‌తో అమెరికా అనుసరించిన వైరం సహజంగానే ఆ రెండు దేశాలనూ మరింత దగ్గర చేసింది. పశ్చిమాసియాలో చక్రం తిప్పుతున్న అమెరికాకు ఇక చైనా సాయంతో ఇరాన్ సవాలు విసరగలదు. ఈ ఒప్పందంతో ఇరాన్ పూర్తిగా చైనా చేతుల్లోకి పోయినట్టే. చైనా ప్రవేశంతో ఇక ఉపసంహరణలు, నిష్క్రమణలే తప్ప భారత్ పెట్టుబడులకు భవిష్యత్తులో అవకాశం ఉండదు. భారత్ అమెరికా బంధం స్వల్పకాలంలోనే ద్విగుళం బహుళం అయిన తరువాత ఇటువంటి పరిణామాలు ఎదురుకాక తప్పదు. ఇరాన్ నిర్ణయంతో తదుపరి వ్యూహాలపై చర్చించాల్సి ఉంటుంది.

# సాధారణ మాస్కులే మేలు

## కేంద్రం మార్గదర్శకాలు జారీ

న్యూఢిల్లీ,జూలై21(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ సంక్షోభం నేపథ్యంలో జనం అంతా మాస్కులు ధరిస్తున్నారు. అయితే ఎన్95 మాస్కులు ధరిస్తున్న వారికి కేంద్రం హెచ్చరిక జారీ చేసింది. గాలి పీల్చే వాల్వ్‌లు ఉన్న ఎన్95 మాస్కులు హానికరమని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఇలాంటి మాస్కులు.. వైరస్ వ్యాప్తిని నియంత్రించలేవని ఆరోగ్యశాఖకు చెందిన డైరక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ పేర్కొన్నది. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య కార్యదర్శులకు, వైద్య విద్యా సంస్థలకు.. కేంద్ర ఆరోగ్యశాఖ ఓ సర్క్యులర్ జారీ చేసింది. దేశవ్యాప్తంగా తప్పుడు పద్ధతిలో ఎన్95 మాస్కులను ధరిస్తున్నట్లు ఆరోగ్య శాఖ ఆరోపించింది. హెల్త్ వర్కర్లు కాకుండా ఇతర ప్రజలు గాలి పీల్చే వాల్వ్ ఉన్న ఎన్95 మాస్కులు వాడుతున్నట్లు తెలియజేసింది. అయితే సాధారణ ప్రజలు ఇంట్లో తయారు చేసిన ముఖం మాస్కులను మాత్రమే వాడాలని డీజీహెచ్ఎస్ తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. డీజీహెచ్ఎస్ అధిపతి రాజీవ్ గార్గ్ ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాశారు. మాస్క్ రంగుతో ఎటువంటి సంబంధం లేదని ఆరోగ్యశాఖ చెప్పింది. కానీ ప్రతి రోజు సాధారణ మాస్కులను 5 నిమిషాల పాటు వేడి నీటిలో ఉతకాలని సూచించింది. ఉతికేటప్పుడు ఉప్పు వేస్తే మంచిదని పేర్కొన్నది.

## రైతువేదికకు శంకుస్థాపన

మేడ్చల్ మల్కాజ్‌గిరి ,జూలై 21 (ఆర్ఎన్ఎ): రైతువేదికలతో రైతు సమస్యలకు పరిష్కారం దక్కగలదని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందిన అన్నారు. జిల్లాలోని శామీర్‌పేట మండలంలోని లాల్‌గడి మలక్‌పేట్‌లో రైతు వేదిక భవనానికి మల్లారెడ్డి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, డిసియంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, నందారెడ్డి, ఎంపిపి ఎల్లు బాయి, జెడ్పిటిసి అనిత, జిల్లా కో ఆప్షన్ సభ్యులు జహీర్, ఎంపీటీసీ ఇందిర, సర్పంచ్ వనజ, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

# అతిపెద్ద సమస్యగా మొండి బకాయిలు

## కరోనా సంక్షోభంతో మళ్లీ ఎగబాకవచ్చని ఆందోళన
## మారటోరియం గడువు ముగిశాక డిఫాల్టర్లు పెరిగే ఛాన్స్

ముంబై,జూలై21(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ రంగ బ్యాంకులకు మొండి బకాయిలు అతిపెద్ద సమస్యగా మారాయి. గత రెండేళ్లలో తగ్గుముఖం పడుతూ వచ్చిన ఎన్‌పీఏలు.. కరోనా సంక్షోభంతో మళ్లీ ఎగబాకవచ్చని బ్యాంకర్లు ఆందోళన చెందుతున్నారు. 2018 మార్చి చివరిం ాటికి 11.6 శాతానికి పెరిగిన బ్యాంకింగ్ రంగ ఎన్‌పీఏలు.. 2020 మార్చి నాటికి 8.5 శాతానికి తగ్గాయి. కరోనా దెబ్బకు 2021 మార్చి నాటికి 13-14 శాతానికి పెరగవచ్చని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఎస్ అండ్ పీ హెచ్చరించింది. లాక్‌డౌన్‌తో ఆదాయం కోల్పోయిన రుణగ్రహీతలకు ఊరట కల్పించేందుకు ఆర్‌బీఐ మారటోరియం ప్రకటించింది. మార్చి నుంచి అమల్లోకి వచ్చిన మారటోరియం ఆగస్టు 31తో ముగియనుంది. మారటోరియం గడువు ముగిశాక ఈఎంఐ డిఫాల్ట్‌లు ఒక్కసారిగా పెరగవచ్చని, మారటోరియం ఎంచుకున్న రుణఖాతాల్లో చాలావరకు మొండి బకాయిలుగా మారే ప్రమాదం ఉందని బ్యాంకింగ్ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఈ తరుణంలో పీఎ?సబీల ప్రైవేటీకరణ సాధ్యపడక పోవచ్చు. పరిస్థితులు కుదుటపడ్డాక వచ్చే ఆర్థిక సంవత్సరం అంటే 2021-22లో ప్రక్రియను మొదలుపెట్టే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కరోనా సంక్షోభంతో ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. ప్రభుత్వ ఖజానా ఖాళీ అయింది. కీలకేతర రంగాల్లోని ప్రభుత్వ సంస్థల్లో మెజారిటీ వాటాల విక్రయం ద్వారా భారీగా నిధులు సేకరించేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. గత ఏడాది మోదీ సర్కారు ఒకేసారి 10 పీఎ÷-÷-సబీల విలీనం ద్వారా 4 బడా ప్రభుత్వ బ్యాంకులను ఏర్పాటు చేసింది. ఆ ప్రక్రియలో భాగంగానే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లో ఆంధ్రా బ్యాంక్ విలీనమైంది. ఇంకా విలీనం చేయని బ్యాంకులను ప్రైవేట్ పరం చేయాలని భావిస్తున్నట్లు ప్రభుత్వ అధికారి ఒకరు వెల్లడించారు. ప్రభుత్వ బ్యాంకింగ్ రంగంలో ఇకపై విలీనాలు ఉండవని ఓ పీఎస్‌బీకి చెందిన సీనియర్ అధికారి అన్నారు. అంటే, నిధుల సేకరణకు సర్కారు ముందున్న ఏకైక అవకాశం వాటాల విక్రయమేనని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ బ్యాంకుల ప్రైవేటీకరణపై కసరత్తు జరుగుతున్నదని, ప్రణాళిక సిద్ధం కాగానే కేబినెట్ ఆమోదం కోసం పంపడం జరుగుతుందని ప్రభుత్వ అధికారి చెప్పారు. మన దేశంలో ఐదుకు మించి ప్రభుత్వ బ్యాంకులక్కర్లేదని పలు ప్రభుత్వ కమిటీలు, ఆర్‌బీఐ ఇప్పటికే సూచించిన సంగతి విదితమే. ప్రస్తుతం దేశంలోని డజను ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో సగానికిపైగా ప్రైవేటీకరించాలని మోదీ సర్కారు భావిస్తున్నట్లు సమాచారం. తద్వారా పీఎ÷-÷-సబీల సంఖ్యను భవిష్యత్‌లో 4 లేదా 5కు తగ్గించాలనుకుంటున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. తొలుత అర డజను బ్యాంకులను ప్రైవేటీకరించే అవకాశం ఉంది. ప్రైవేటీకరణకు రంగం సిద్ధమవుతోందని ఈ మధ్య నిర్వహించిన ఓ మీడియా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) కేవీ సుబ్రమణియన్ వెల్లడించారు. ఆత్మ నిర్భర్ ప్యాకేజీలో భాగంగా వ్యూహాత్మక రంగాల్లోని ప్రభుత్వ కంపెనీల ను ప్రైవేటీకరించాలని మోదీ సర్కారు నిర్ణయించింది. వ్యూహాత్మక రంగాల్లో గరిష్ఠంగా 4 పీఎస్‌యూలనే కొనసాగిస్తామని, మిగతా వాటిని ప్రైవేటుపరం చేయనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఇందులో భాగంగానే బ్యాంకింగ్‌ను వ్యూహాత్మక రంగాల జాబితాలో చేర్చనున్నట్లు సుబ్రమణియన్ తెలిపారు.

# రాజస్థాన్‌లో పారని బిజెపి పాచిక

## సచిన్‌ను వదులుకోవడం కాంగ్రెస్‌కు నష్టమే
## గెహ్లాట్ లాంటి వృద్దనేతలతో పార్టీకి కష్టమే

జయపుర,జూలై 21(ఆర్ఎన్ఎ): మధ్యప్రదేశ్‌లో జ్యోతిరాదిత్య సింధియాలాగా సచిన్ పైలట్‌ని, అతని అనుయాయుల్నీ చేర్చుకోవడానికి బీజేపీ ప్రాధాన్యమిచ్చినా ఎందుకనో అక్కడ పాచిక పారలేదు. మధ్యప్రదేశ్ తరహా రాజకీయ తిరుగుబాటును ప్రేరేపించడంలో రాజస్తాన్ బీజేపీ విజయవంతం కాలేకపోయింది. మరోవైపున మొన్న జ్యోతిరాదిత్య సింధియా, నేడు సచిన్ పైలట్ వంటి యువ నాయకులు పార్టీనుంచి నిష్క్రమించాలని ప్రయత్నించడం చూస్తుంటే కాంగ్రెస్ పార్టీలో యువనేతలు ఏమంత సంతోషంగా లేరని స్పష్టమవుతోంది. అందుకే ముఖ్యమంత్రి గెహ్లాత్ తాత్కాలికంగా బతికి బట్టకట్టినట్లు కనిపిస్తున్నా, అంతిమంగా బీజేపీయే ప్రయోజనం పొందనుంది. కాంగ్రెస్‌లో వృద్ధ జంబుకాల కారణంగా వారు బిజెపిని,మోడీని ఢీకొనలేకపోతున్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో కాంగ్రెస్ వ్యూహాత్మకంగా వ్యవహరించి ఉంటే బిజెపి తలదూర్చేది కాదు.

రాజస్తాన్‌లో చోటుచేసుకున్న పరిణామాలను ఈ మార్చి నెలలో మధ్యప్రదేశ్‌లో జరిగిన పరిణామాలతో పోల్చి చూడవచ్చు. రెండు చోట్లా పార్టీని వీడి కాంగ్రెస్ యువనేతలు బయటకు రావాలనుకున్నారు. పోలిక అంతవరకే కానీ తదనంతర పరిణామాలు మాత్రం రెండు రాష్ట్రాల్లో పూర్తి భిన్నంగా ఉన్నాయి. అంతర్గత కారణాల వల్ల రాజస్తాన్‌లో అధికారం అందిపుచ్చుకోవడానికి బీజేపీ సిద్ధం కాకపోయి ఉండవచ్చు. దీంతో మొత్తం పరిస్థితి తిరగబడింది. పైగా మధ్యప్రదేశ్‌లో రేపిన తిరుగుబాటులాంటిదాన్ని రాజస్తాన్‌లో బీజేపీ నిర్వహించలేకపోయింది. ఎందుకంటే రాజస్తాన్‌లో తన పార్టీ అంతర్గత పరిస్థితి సరిగా లేదు. రాజస్తాన్‌లో బీజేపీ మాజీ ముఖ్యమంత్రి, బలవంతురాలైన వసుంధరా రాజే సింధియాను సవాలు చేయాలని బీజేపీ కేంద్ర నాయకత్వం భావించలేదు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు సాధించినప్పటికీ వసుంధరా రాజేకి అధికారం మరోసారి కట్టబెట్టడానికి బీజేపీ సిద్ధంగాలేదు. ప్రస్తుతం జోథ్‌పూర్ ఎంపీ గజేంద్ర సింగ్ షెకావత్‌కు బీజేపీ మద్దతిస్తూ వచ్చింది. రాజస్తాన్ తాజా పరిణామాలను చూస్తే రాష్ట్రంలో అశోక్ గెహ్లాత్ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ ఎలాగోలా నిలబెట్టుకున్నా అంతిమ ప్రయోజనం బీజేపీకే సిద్ధించనుంది. రాజస్తాన్‌లో సచిన్ పైలట్ తిరుగుబాటును కాంగ్రెస్ బూచిగా చూపి సచిన్‌ను మాత్రం దూరం చేసుకుంది. నిజానికి సచిన్ లేకుంటే రాజస్థాన్‌లో కాంగ్రెస్ గెలిచి ఉండేది కాదన్న నిజాన్ని పార్టీ వృద్ధ నేతలు గమనించడం లేదు. వ్యక్తిగత ఆశలు, ఆకాంక్షల ఫలితంగా అశోక్ గెహ్లాట్ గద్దెను దిగకపోవడంతో పాటు తనకు తిరుగులేదన్న రీతిలో వ్యవహరించారు. దీనితో కాంగ్రెస్ పార్టీకి సంభవించే పర్యవసానాలను గురించి ఆలోచించడం లేదు. సచిన్ పైలట్ పార్టీ నుంచి వైదొలగడాన్ని కాంగ్రెస్‌పార్టీ సంస్థాగతంగా రాజకీయ పరాజయంగా చూడాలి. అయితే బిజెపిలో చేరకకూడదన్న సచిన్ పైలట్ నిర్ణయం చూస్తుంటే.. ఈ పరిస్థితిని రేపు దీర్ఘకాలిక రాజకీయ అవకాశంగా తాను మల్చుకోగలరా అనేది చూడాలి. రాజస్తాన్‌లో పార్టీని చీల్చి ముందుగా ప్రాంతీయ పార్టీని పెట్టాలని తర్వాత బీజేపీ పొత్తుతో ప్రభుత్వం ఏర్పర్చాలని పైలట్ భావించారని తెలుస్తోంది. అయితే ఇది పనిచేయదని భావించిన బీజేపీ నాయకత్వం పైలట్‌ని తన అనుయాయులను జ్యోతిరాదిత్య సింధియాలాగే పార్టీలోకి నేరుగా చేర్చుకోవడానికే ప్రాధాన్యమిచ్చింది. సింధియా విషయంలో వ్యవహరించినట్లే పైలట్‌కు కూడా కేంద్రంలో మంత్రి పదవి లేక రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టడానికి కూడా సిద్ధమైపోయింది. అయితే సచిన్‌తో సంభాషించిన బీజేపీ నేతలు తన అనుయాయులందిరికీ మంత్రిపదవులు ఇవ్వడానికి కానీ, అనర్హత వేటు పడితే వారికి రాజకీయ హామీలు ఇచ్చే ఉంటారు. పైగా రాజస్తాన్‌లోనూ అధికార మార్పిడికోసం ఫిరాయింపు చేసే ఎమ్మెల్యేలకు డబ్బు ఎర చూపినట్లు పుకార్లు వ్యాపించాయి. దీనికి సంబంధించిన టెలిఫోన్ సంభాషణలు కూడా రాజస్తాన్ పోలీస్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్‌కు లభించాయి.

అది సర్వసాధారణంగా జరిగే ప్రక్రియే. కానీ ఇలాంటి ఆధారం లభించిందంటే మాత్రం సచిన్ పైలట్ ప్రతిష్ట మసకబారిపోతుంది. పైగా ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ మాజీ ఉపముఖ్యమంత్రి పైలట్‌పై దూకుడుగా గురిపెట్టారు. స్థానిక పరిస్థితులను బేరీజు వేసుకున్నప్పుడు కాంగ్రెస్‌లో ఆవిర్భవిస్తున్న ప్రత్యామ్నాయ ప్రాంతీయ నేతలను తన గుప్పిట్లోకి తెచ్చుకోవడం పట్ల బీజేపీ చాలా సంతోషంగా ఉంటున్నట్లు తెలుస్తోంది. బీజేపీకి ఇప్పుడు క్షేత్రస్థాయిలో పుట్టుకొచ్చిన యువనేతల దన్నును స్వీకరించే అవకాశం కూడా ఉంటుంది. దీంతో పార్టీ రాజకీయ పునాది పెరిగి, ఓటర్లలోని కొత్త సెక్షన్లలో బీజేపీ పట్ల ఆమోదం కూడా పెరిగే అవకాశం ఉంటుంది. ముందే చెప్పినట్లుగా సింధియా, పైలట్ వంటి యువనేతల వరుస నిష్క్రమణను చూస్తే కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలతో దాని యువనేతలు సంతుష్టిగా లేరని రాజకీయ సంకేతాలు వెలువడుతున్నాయి. కాంగ్రెస్ పార్టీలో సచిన్ పైలట్ యువ సహచరులైన జితిన్ ప్రసాద వంటివారు పైలట్‌కు మద్దతుగా ప్రకటనలు గుప్పించడం దీన్నే రుజువు చేస్తోంది. మరో యువనేత మిలింద్ దేవరా ఇంకా స్పందించలేదు కానీ తానుకూడా పైలట్ బాటలోనే పయనించబోతున్నట్లు సూచనలు వస్తున్నాయి. ఈ పరిణామాలన్నింటినీ బేరీజు వేసుకున్నప్పుడు యూపీఏ-2 పాలనలో మంత్రి పదవులు పొందిన రాహుల్ యువ శక్తి, కాంగ్రెస్ భవిష్యత్తుగా భావించిన యువనేతలు ఈరోజు పార్టీతో కొనసాగాలని ఏమాత్రం కోరుకోవడం లేదు. తమ వ్యక్తిగత ఆకాంక్షలు, ఆశల కోసమే వారు మాతృసంస్థకు దూరమవుతున్నారు. పైగా పార్టీ తమను చిన్నచూపు చూస్తోందన్న అభద్రత కూడా వారిలో అలుముకున్నట్లుంది. కాంగ్రెస్ నాయకత్వానికి గుణపాఠం నేర్పడానికి, పార్టీలోని రాజకీయ ప్రత్యర్థులకు సవాలు విసరడానికి చిట్టచివరి సాధనంగా మాత్రమే వీరు ఫిరాయింపులను ఎంచుకుంటున్నారు.

# రైతులను ఆదుకునేలా వేదికల నిర్మాణం

## రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట
## వ్యవసాయాన్ని పండగ చేయాలన్నదే కెసిఆర్ సంకల్పం
## రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

ఖమ్మం,జూలై21(ఆర్ఎన్ఎ): రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకే ప్రభుత్వం రైతు వేదికలను ఏర్పాటు చేసి మరింత చేయూతనిస్తోందని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. జిల్లాలోని సత్తుపల్లి నియోజకవర్గం పెనుబల్లి మండలం అడవిమల్లెల గ్రామంలో రూ. 22 లక్షలతో నిర్మించనున్న రైతు బంధు వేదిక నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతులకు పుష్కలంగా నీళ్లు, రైతుబంధు సాయం, గిట్టుబాటు ధర కల్పిస్తూ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. రైతును రాజును చేస్తానని తొలి నాళ్లలో ముఖ్య మంత్రి కేసీఆర్ చెప్పిన విషయం గుర్తు చేశారు. నాడు చెప్పారు.. నేడు చేసి చూపిస్తున్నారు. అది నిబద్ధత అంటే అని కొనియాడారు. మాటలతో కాలయాపన చేయకుండా వ్యవసాయాన్ని పండగ చేయాలనే ఒకే సంకల్పంతో నేటి వరకు అలుపెరుగక శ్రమిస్తున్న ముఖ్యమంత్రి దార్శనికత నేడు దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఖమ్మం జిల్లాలోని 129 క్లస్టర్ ల పరిధిలోని 129 రైతు వేదికల నిర్మాణాలు పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. దీనితో పాటు రైతులకు కేటాయించిన కల్లాలను కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు. నియోజకవర్గానికి వెయ్యి కేటాయించామని అన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ముందుచూపుతో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు, ఇతర సంస్కరణలు వ్యవసాయానికి ఊతమిచ్చాయని, రైతులందరినీ ఒకే చోటకు చేర్చి సాగుపై చర్చించుకొనే అవకాశాన్ని కల్పించాలని నిర్ణయించడం వ్యవసాయ రంగంలోనే ముందడుగు అన్నారు. రాష్ట్రంలో అరుదైన చరిత్ర ఆవిష్కృతం కాబోతున్నదని, ఈ వానాకాలం చరిత్రలోనే రికార్డు స్థాయిలో ఆయకట్టుకు సాగునీరు అందించామని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. అడవి మల్లెల గ్రామంలోని లంకా సాగర్ చెరువు నుంచి సాగునీటిని దిగువకు వదిలారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి ఎకరా సాగులోకి వచ్చే




ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం పెనుబల్లి మండలం అడవిమల్లెల గ్రామంలో రైతు వేదిక నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్. చిత్రంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తదితరులు ఉన్నారు.

విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని, ఈ ప్రాజెక్ట్ ద్వారా రెండు పంటలకు పుష్కలంగా సాగునీటిని అందించి సస్యశ్యామలం చేస్తామన్నారు. సీతారామ జిల్లాకు వరప్రదాయని అని పేర్కొన్నారు. కొత్త ప్రాజెక్టులు కూడా అందుబాటులోకి రావడంతో ఎప్పుడూ లేని విధంగా అత్యధిక ఆయకట్టుకు సాగునీరు అందబోతున్నదని, ప్రస్తుతం కృష్ణా, గోదావరి బేసిన్లలోని ప్రాజెక్టులు, వాటిలో ఉన్న నీటి నిల్వలు, ఎగువ నుంచి వచ్చే వరద ప్రవాహాలను అంచనా వేస్తే... ఈ విషయం అర్థమవుతుందని పేర్కొన్నారు. భారీ, మధ్య, చిన్న తరహా ప్రాజెక్టుల పరిధిలో ప్రస్తుత వానాకాలంలో ఏకంగా 41 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించాలని ప్రభుత్వం నిర్ణయించిం దన్నారు. ఇప్పటి వరకు ఈ స్థాయిలో ఎప్పుడూ ఆయకట్టుకు నీటిని సరఫరా చేయలేదని అన్నారు. 2014-15 సంవత్సరంలో తెలంగాణలో వానాకాలం పంటకు కేవలం 9,73,072 ఎకరాలకు నీరు అందితే, నేడు అది 41,00,000 ఎకరాలకు చేరుకోవడం ముఖ్యమంత్రి కేసీఆర్ పరిపాలనలో తెలంగాణ ఎట్లా పచ్చబడ్డదో నిలువెత్తు నిదర్శనంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ , అదనపు కలెక్టర్ స్నేహలత, రైతుబంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మల, డీసీఎమ్మెస్ చైర్మన్ శేషగిరిరావు, అధికారులు, నాయకులు ఉన్నారు.

# హిమాచల్‌ప్రదేశ్‌లో తగ్గుముఖం పట్టిన కరోనా కేసులు

షిమ్లా,జులై 21: హిమాచల్ ప్రదేశ్‌లో కరోనా కేసులు తగ్గుముఖం పట్టాయి. తాజాగా అక్కడ గడిచిన 24 గంటల్లో 10 కేసులు మాత్రమే నమోదయ్యాయి. దీంతో మొత్తం కేసుల సంఖ్య 1641కు చేరింది. అందులో కేవలం 547 కేసులు మాత్రమే దవాఖానలో చికిత్స పొందుతుండగా 1067 మంది కరోనా బారి నుంచి బయటపడి దవాఖాన నుంచి డిశ్చార్జి అయినట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలియజేశారు. ఇప్పటివరకు కేవలం 11 మంది మాత్రమే అక్కడ మరణించినట్లు తెలిసింది.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.